సీమవార్త
రాయల సీమ
అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా
పేజీలు : 4
బుధవారం 16 సెప్టెంబర్ 2026

# అనంతకు మహర్దశ..!!

....నగరంలో రూ.107.71 కోట్ల కీలక ప్రాజెక్టులకు శ్రీకారం..లి

....అమృత్ 2.0 పథకం కింద రెండు ప్రాజెక్టులకు భూమిపూజ.

...జిల్లా ఇన్చార్జ్ మంత్రి టీజీ.భరత్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా పనులు ప్రారంభం.

హాజరైన....ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్.

...ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో తాగునీరు, మురుగునీటి వ్యవస్థలో మార్పులులి

.....6 నెలల్లోనే ప్రాజెక్టు పనులు పూర్తవుతాయి : ఎంపీ అంబికా లక్ష్మీనారాయణలి

....ప్రభుత్వం చేస్తున్న మంచిని గుర్తించాలి : ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు.



# జగన్ ఊర్లో “ పచ్చ” ని ఫైరింగ్..!!






.....పులివెందులలో కాల్పుల కలకలం.

టిడిపి వర్గీయుల మధ్య భగ్గుమన్న విభేదాలు.

పరస్పర దాడులతో దద్దరిల్లిన మైత్రి లేఅవుట్.

డీఎస్పీ మురళి నాయక్ ప్రవేశంతో సద్దుమణిగిన వివాదం.

**పులివెందుల సెప్టెంబర్ 15 (సీమ వార్త):**

పులివెందుల పట్టణంలో కాల్పుల కలకలం దృశ్యా ఉత్కంఠ వాతావరణానికి దారితీసింది. టిడిపి వర్గీయుల మధ్య విభేదాలు బయటపడడంతో పరస్పరం దాడులకు తెగబడ్డారు. ఈ దాడులలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. డీఎస్పీ మురళి నాయక్ రంగ ప్రవేశం చేయడంతో పరిస్థితి కాస్త సద్దుమణిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పులివెందుల పట్టణం మైత్రి లేఅవుట్ లో టిడిపి నేత పుష్ప నాగిరెడ్డి వినాయక ప్రతిమను నెలకొల్పారు. ఈ సందర్భంగా టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసార రెడ్డి మరికొందరు టిడిపి నాయకులు మైత్రి లేఔట్ వద్ద వినాయక మండపం వెళ్లారు. ఈ సందర్భంగా విచ్చేసిన బీటెక్ రవి, పార్థసారధి రెడ్డిలను పుష్ప నాది రెడ్డి ఘనంగా సన్మానించారు. ఇందులో తమను ఎందుకు సన్మానించలేదంటూ టిడిపి నేత హక్కుల గారి విజయ్ కుమార్ రెడ్డి మనసులో పెట్టుకున్నారు. ఈ విషయమై సోమవారం రాత్రి పది గంటల ప్రాంతంలో అటు పుష్పనాథ రెడ్డి ఇటు విజయకుమార్ రెడ్డిల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదం చిలికి చిలికి గాలి వానగా మారి ఘర్షణ వరకు దారితీసింది. ఈ సమయంలో ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మహబూబ్ బాషా గన్మెన్ రబ్బాని రెండు రౌండ్ గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ మురళి నాయక్ తమ సిబ్బందితో కలిసి సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని అదుపు చేశారు. ఇరువర్గాల ఇరువర్గాల వారిని స్టేషన్ కు పిలిచి విచారిస్తున్నట్లు తెలిసింది.



# ప్రతి అర్హునికి సంక్షేమం.. సత్యన్న హామీ..!!

....ప్రజా సమస్యలపై మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతులు.

....రెవెన్యూ నుంచి విద్యుత్, నీటి సమస్యల వరకు.. మంత్రిని కలిసిన నియోజకవర్గ ప్రజలు

....పింఛన్లు, సీఎంఆర్ఎఫ్, చేనేత సమస్యలపై మంత్రికి ప్రజల వినతులు

.....ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం.. ప్రతి వినతిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం

.....ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది:.....మంత్రి సత్యకుమార్




**ధర్మవరం, సెప్టెంబర్ 15 సీమ వార్త.**

ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ప్రజలు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ ని కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రాలు సమర్పించారు. నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను మంత్రి సత్యకుమార్ యాదవ్, స్వయంగా కలుసుకుని వారి సమస్యలను ఓర్పుగా - మిగతా3లో



# గణేశుని సేవలో.. పోలీస్ భాస్..!!

.... నిమజ్జనాలు స్నేహపూర్వక వాతావరణం లో జరగాలి.

.... ధర్మవరంలో పలు గణేష్ విగ్రహాలను సందర్శించిన జిల్లా ఎస్.పి సతీష్ కుమార్.

**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 15 సీమవార్త :**





సామాన్య భక్తుడిగా గణేశుని సేవలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ కొనసాగిస్తూ, నిరాడంబరంగా నేలపై కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రశాంతంగా వినాయక చవితి వేడుకలను నిమజ్జనం వరకు నిర్వహించుకోవాలని ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు. తదుపరివారు ధర్మవరం, రామగిరి ప్రాంతాలలో వినాయక మండపాలు, నిమజ్జన ప్రాంతాల పరిశీలన చేశారు.వివిధ ప్రాంతాలలో వినాయక మండపాలను భక్తిశ్రద్ధలతో సందర్శించారు.పోలీసు బందోబస్తు, విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను ఎస్పీ పర్యటించి పరిశీలించారు.జిల్లా ఎస్పీ తో పాటు, డీఎస్పీతో కలిసి ఎల్ సి కె పురం, ఎల్.పి. సర్కిల్ పరిధిలోని వినాయక మండపాలను సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సోదరభావంతో పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని నిర్వాహకులకు, యువతకు సూచించారు.అనంతరం ధర్మవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మండపాల నిర్వాహకులు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎలాంటి గొడవలు లేకుండా వేడుకలు, నిమజ్జన కార్యక్రమాన్ని స్నేహ పూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలని, అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేసి ఇతరులకు ఇబ్బంది కలిగించరాదని, మద్యం సేవించి అవాంఛనీయ చర్యలకు పాల్పడకూడదని సూచించారు. బందోబస్తు దృష్ట్యా శుక్రవారం నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించేలా పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. నిమజ్జనం సమయంలో విగ్రహాలు ఒక క్రమ పద్ధతిలో తీసుకురావాలన్నారు. ఈ వేడుకలు సజావుగా జరిగేందుకు పోలీసు శాఖకు నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలనిసూచించారు. ధర్మవరం చెరువులో విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని వారు పరిశీలించారు. బారికేడింగ్, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ఊరేగింపుల సమయంలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాలపై నిరంతర నిఘా ఉండేలా సీసీ కెమెరాలు, డ్రోన్ టెక్నాలజీ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పోలీసు సూచనలు తప్పనిసరిగా ప్రజలు పాటించాలి అని,వినాయక చవితి వేడుకలు ప్రారంభం నుంచి విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీసు శాఖ సూచించే భద్రతా నిబంధనలు, ట్రాఫిక్ నియమాలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటిస్తూ పోలీసులకు సహకరించాలని వారు కోరారు.ఈ పర్యటనలో డీఎస్పీ బి.వి. జగన్నాథ్ రాజు, సీఐలు జయ నాయక్, మహమ్మద్ అలీ, ఎస్ఐలు ఇషాక్ భాష, రిజ్వాన్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ వైష్ణవ శ్రీనివాసులు స్వామికి స్వర్ణ నంది అవార్డు..



**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 15 సీమవార్త :** జర్నలిజం రంగంలో తనదైన ముద్ర వేస్తూ ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్ట్ శ్రీ వైష్ణవ శ్రీనివాసులు స్వామి ప్రతిష్ఠాత్మక స్వర్ణ నంది అవార్డుకు ఎంపిక కావడం పట్ల జర్నలిస్టులు,పాత్రికేయ మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన అవార్డుకు ఎంపిక కావడం ధర్మవరం జర్నలిజం రంగానికి గర్వకారణమని పేర్కొన్నారు.వైష్ణవ శ్రీనివాసులు స్వామి ప్రజల సమస్యలను తన కలం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం తో పాటు,సమాజంలో జరుగుతున్న అనేక అంశాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చారని కొనియాడారు. ప్రజల పక్షాన నిలబడి నిబద్ధతతో పనిచేయడం ద్వారా పాత్రికేయ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు.అదేవిధంగా తోటి జర్నలిస్టులకు విలువలతో కూడిన సూచనలు,సలహాలు అందిస్తూ ఎంతోమందిని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. జర్నలిజంలో నైతిక విలువలు,ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న ఆయన సేవలకు స్వర్ణ నంది అవార్డు మరింత గుర్తింపు తీసుకువస్తుందని పేర్కొన్నారు.స్వర్ణ నంది అవార్డుకు ఎంపికైన వైష్ణవ శ్రీనివాసులు స్వామికి జర్నలిస్ట్ మిత్రులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ,ప్రజల గొంతుకగా ఆయన కలం మరింత బలంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## ఎస్సై మల్లికార్జున రెడ్డికి సన్మానం

**యువకులు..ఎస్సై ను ఆదర్శంగా తీసుకోవాలి**

**జనసేన... కొండబోయిన సతీష్**



**ఓబులదేవరచెరువు (సెప్టెంబర్16) సీమవార్త:** గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించే దిశగా ప్రయత్నం చేస్తున్న ఎస్సై మల్లికార్జున్ రెడ్డి ని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని జనసేన నాయకులు కొండబోయిన సతీష్ పిలుపునిచ్చారు.చట్ట వ్యతిరేక చర్యలను అరికడుతూ.... విధుల్లో నిబద్ధత చూపుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఎస్ఐ మల్లికార్జున రెడ్డికి జనసేన నాయకులు సతీష్ కొండకమర్ల వైయస్సార్ సర్కిల్లో మంగళవారం సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐకి పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పలువురు జనసేన నాయకులు, యువకులు,స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని మండల వ్యాప్తంగా ఎస్సై చేస్తున్న విధుల సేవలపై ప్రశంసించారు. అలాగే కార్యక్రమంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో కొండబోయిన సతీష్ తో పాటు యువకులు దామోదర్,గంగరాజు, అనిల్,సాయి,వినోద్ తదితర నాయకులు, కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ అయోధ్య రామాలయ నిర్మాణం భూమి పూజ కార్యక్రమానికి మంత్రికి ఆహ్వానం



**సోమందేపల్లి సెప్టెంబర్ 15 సీమ వార్త** మండల కేంద్రంలోని స్థానిక మారుతి నగర్ లోని పెద్దలు, భక్తులు టీటీడీ నిధులతో శ్రీ అయోధ్య రామాలయం నిర్మాణం చేపట్టారు. హిందూపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కాలనీవాసులు మంత్రి సవితమ్మను కలిసి 20 వ తేదీ ఆదివారం ఉదయం 9:30 నిమిషాలకు భూమి పూజ కార్యక్రమంనిర్వహిస్తున్నామని శ్రీ అయోధ్య రామాలయం భూమి పూజ కార్యక్రమంలో మంత్రి సవితమ్మను పాల్గొనాలని ఆహ్వాన పత్రికను అందజేశారు . ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి కృషి చేసిన మంత్రిని కాలనీ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నడింపల్లి వెంకటేష్,భాను కీర్తి, పెద్దకోడిపల్లి నాగప్ప,ఈడిగ నరసింహప్ప,చింతా రామాంజనేయులు, పెదకోడిపల్లి నరసింహమూర్తి, పూజారి మురళి, శ్రీరాములు, భాస్కర్, శంకర్ పాల్గొన్నారు.

## ఏంపిటిసి జడ్పిటిసి ఎన్నికలకు సంబందించి సమావేశం

**టి సుండుపల్లె సెప్టెంబర్ 15** సీమ వార్త మండలం లోని పంచాయతీ కార్యదర్శులు అందరికీ తెలియజేయడమేమనగా జిల్లా కలెక్టర్ వారి ఆదేశముల మేరకు జరగబోయే ఎంపీటీసీ మరియు జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి రాజకీయ నాయకులతో రేపు అనగా 16.09.2026 వ తేదీన ఉదయము 10:00 కి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయము నందు సమావేశమును ఏర్పాటు చేయడం జరిగినది కావున మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలోని రాజకీయ పార్టీల నాయకులకు రాజకీయ నాయకులు అందరూ తప్పక సదరు సమావేశమునకు హాజరు కావలసినదిగా కోరడమైనదని మండల అభివృద్ధి అధికారి సుధాకర్ రెడ్డి తెలియజేసాడు.

## పాఠశాల కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

**టి సుండుపల్లె సెప్టెంబర్ 15సీమ వార్త** మండలంలో ఉన్నటువంటి అన్ని ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలకు సంబందించి నోటిఫికేషన్ పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఏం పి పి స్కూల్ తెలుగు నందు మండల విద్యాశా ఖదికారి 2 రవీంద్రనాయక్ ప్రదర్శించడమైనది. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.మండలం లోని అన్ని పాఠశాల ల్లో ఈ నోటిఫికేషన్ ను ప్రదర్శించడమైనది. సెప్టెంబర్ 18 ఓటర్ల జాబితా ప్రదర్శన, 25 న ఓటర్ల జాబితా పై అభ్యంతరాలు, అదేరోజు తుది ఓటర్ల జాబితా,29 న స్కూల్ కమిటీ ఎన్నిక అదేరోజు చైర్ పర్సన్ మరియు వైస్ చైర్ పర్సన్ ఎన్నిక, ప్రమాణ స్వీకారం, మొదటి కమిటీ సమావేశం జరుగుతుందని ఆయన తెలియజేసాడు




## ఉత్తమ ఇంజనీర్ కు అవార్డు అందజేత



**మడకశిర సెప్టెంబర్ 15 సీమ వార్త** భారతరత్న అవార్డు గ్రహీత కీర్తి శేషులు శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165 వ జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డే ను అనంతపురం పంచాయితీ రాజ్ సర్కిల్ కార్యాలయం నందు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ బాలు నాయక్ , విజయవాడ పాల్గొని భారత రత్న అవార్డు గ్రహీత కీర్తిశేషులు మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహ ఆవిష్కరణ చేసి విధులలో ఉత్తమ సేవలు అందించిన ఇంజనీర్లకు అవార్డులు ప్రధానం చేశారు. సత్య సాయి జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన మడకశిర పంచాయితీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యం. వెంకటేశులు కి ఉత్తమ సేవల ప్రశంసా పత్రాన్ని ఇచ్చి ఈ ఎన్ సి అభినందించి సన్మానించడమైనది.ఈ కార్యక్రమం నందు అనంతపురము సూపరెంటెండింగ్ ఇంజనీయరు వై.సి.సుబ్బరాయుడు, శ్రీ సత్య సాయి జిల్లా పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ అధికారి బి.మురళీ మోహన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకరయ్య పాల్గొన్నారు.

## ఆశ్రయ మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్య శిబిరం

**మడకశిర సెప్టెంబర్ 15 సీమ వార్త నియోజకవర్గ పరిధిలోని** గుడిబండ మండల కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఆశ్రయ మల్టీ స్పెషలిస్ట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రెస్ క్లబ్ యూనియన్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా కిడ్నీ వ్యాధులు కిడ్నీ వ్యాపు, కిడ్నీలో రాళ్లు, కిడ్నీలో ఇన్ఫెక్షన్, పాము కాటు, తేలుకాటు, ఐసియు, షుగర్ సంబంధించిన వ్యాధులు లివర్ సంబంధ వ్యాధులు, ఊపిరితిత్తి జబ్బులు, ఆయాసం ,అస్తమం రక్తహీనత, మూర్ఛ వ్యాధి వంటి వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అలాగే ఈ హాస్పిటల్ నందు ఎన్టీఆర్ వైద్య సేవ కలదు కావున మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కె.కార్తీక్ కోరారు.మరిన్ని వివరాలకు 7981 05 0735 మొబైల్ నంబర్ కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

## సచివాలయం లో వై పై ఏర్పాటు చేసిన వందేమాతరం టీం సభ్యులు కొండ్ల రమేష్....



**తనకల్లు, సెప్టెంబర్ 15 సీమ వార్త సాయంత్రం న్యూస్..** తనకల్లు మండల పరిధిలోని గేమేనాయక్ తాండ పంచాయతీ, నాయనచెరువు పల్లి నివాసి కొండ్ల రమేష్ గేమె నాయక్ తండా సచివాలయంలో నెట్వర్క్ సమస్య కారణంగా ఇన్కమ్ సర్టిఫికేట్, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, పెన్షన్ దరఖాస్తులు తదితర ప్రభుత్వ సేవలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని, తన సొంత నిధులతో ఔఱ-ఖీఱ సదుపాయాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. గేమేనాయక్ తాండ పంచాయతీ ప్రజలకు ఎల్లవేళలా అండగా నిలుస్తున్న వందేమాతరం కుటుంబ సభ్యుడు అందరి బంధువు కొండ్ల రమేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు మీరు ఇలాంటి సహాయ సహకారాలు మండల వ్యాప్తంగా చేయాలని కోరుతూ ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ. అభినందనలు తెలియజేస్తున్న షేక్ మహబూబ్ బాషాతెలుగుయువత నాయకులు తనకల్లు మండలం.

## గాండ్లపెంట మండలంలోని వాడవాడలా కొలువు తీరిన గణనాథులు..

**వరుణ దేవుడు కరుణించాలని పూజలు**

**గ్రామాల్లో పోలీసుల గస్తీ....**





**గాండ్లపెంట, సెప్టెంబర్ 15 సీమ వార్త....** వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలోని వాడవాడల గణనాథులు కొలువు తీరాయి. ప్రతి యేటా జరిగే వినాయక చవితి పండుగ సందర్భంగాఈ యేడాది పెద్ద ఎత్తున వినాయక విగ్రహాల ప్రతిమలను ఆయా గ్రామాల్లోని మండపాల్లో నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా వరుణదేవుడు కరుణించి పంట పొలాలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ మహిళలు గణనాథులకు సోమవారం కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మండల కేంద్రంతోపాటు, మండలంలోని వేపరాల, రెక్క మాను, చామలగొంది, కురుమామిడి, పాయకట్టు, మల్ల మీద పల్లి, సామ చేనుబైలు, ఎర్రచేనుపల్లి, తూ పల్లి,వంకపల్లి, సోమయాజులపల్లి, జీనులకుంట, కటారుపల్లి, గొడ్డు వెలగల, తుమ్మలబైలు, పెద్ద తాండ, నీరు కుంట్ల పల్లి , కమతంపల్లి,తదితర గ్రామాల్లో దాదాపు 80 కి పైగా వినాయక ప్రతిమలను ఆయా గ్రామస్తులకు చెందిన నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా ముందు జాగ్రత్తగా పోలీసులు గస్తీ తిరుగుతున్నారు. నేడు అనగా బుధవారం ఆయా గ్రామాల్లోని చెరువులు, బావుల్లో భక్తులు వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయనున్నారు.

## పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారిని కలిసిన మాల మహానాడు జిల్లా నాయకులు

**12 సంప్రదాయ కళలకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలి**

**జిల్లా ఇన్చార్జ్ నరసయ్యకు వినతిపత్రం అందజేత**



**పుట్టపర్తి, సెప్టెంబర్ 15 (సీమవార్త బ్యూరో) :** జిల్లాలోని 12 సంప్రదాయ కళలకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరుతూ శ్రీ సత్యసాయి జిల్లా మాల మహానాడు నాయకులు మంగళవారం పర్యాటక, సాంస్కృతిక శాఖ జిల్లా ఇన్చార్జ్ అధికారి నరసయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. మాల కళాకారుల ప్రాచీన కళలైన ఉరుములు, కొమ్ము తదితర 12 సంప్రదాయ కళలను ప్రభుత్వం గుర్తించి, గుర్తింపు కార్డులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గుర్తింపు కార్డులు ఉంటే కళాకారులు పెన్షన్ కు అర్హత పొందడం సులభమవుతుందని తెలిపారు. ఈ మేరకు శాఖ సిబ్బంది ప్రతాప్ రెడ్డికి కూడా వినతిపత్రం ప్రతిని అందజేశారు. జిల్లా అధికారి నరసయ్య స్పందిస్తూ ప్రతిపాదనలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ఎం.ఎన్. మూర్తి, సభ్యులు సోదనపల్లి రామాంజనేయులు, గొల్లపల్లి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎంపీడీవోకు వినతి




**నల్లమాడ:సెప్టెంబర్15(సీమ వార్త):** మండలంలోని 14 గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాలలో నెలకొన్న తాగు నీటి సమస్య ను పరిష్కరించాలని కోరుతూ బిజెపి మండల అధ్యక్షులు పి.చంద్ర మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల బిజెపి నాయకులు బిజెపి రాష్ట్ర కౌల రైతుల కో"కన్వీనర్ డాక్టర్ యస్.హనుమంత రెడ్డి, బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు మురళి మోహన్ తదితరులు కలిసి ఎంపీడీవో అంజనప్పకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో గత నెలల తరబడి తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీడీఓ కు తెలియజేశారు.అయితే తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ నీళ్ల ట్యాంకర్లను ఏర్పాటు చేసి తద్వారా గ్రామాలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు రమేష్,మంగే నాయక్,కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌ను అవమానిస్తే ఇక సహించేది లేదు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డి ఎచ్ పి ఎస్ హెచ్చరిక



**మడకశిర సెప్టెంబర్ 15 సీమ వార్త** భారత రాజ్యాంగం ద్వారా దేశంలోని అణగారిన వర్గాలకు హక్కులు, అవకాశాలు, సమానత్వం, స్వేచ్ఛ కల్పించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని దళిత హక్కుల పరిరక్షణ సమితి డి ఎచ్ పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.ఆర్. హనుమంతు అన్నారు. నేడు దళితులు, గిరిజనులు, బీసీలు, మహిళలు, పేదలు సహా ప్రతి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి, రాష్ట్రపతి వంటి అత్యున్నత పదవులను చేపట్టగలుగుతున్నారంటే దానికి రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులే పునాది అని అన్నారు. న్యాయవాది నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వరకు, ఉపాధ్యాయుడి నుంచి వైస్‌చాన్సలర్ వరకు, ప్రభుత్వ ఉద్యోగి నుంచి కార్మికుడు, రైతు వరకు ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. అయితే అంబేద్కర్ ఇచ్చిన హక్కులతోనే రాజకీయంగా ఎదిగిన కొంతమంది నాయకులు, తమ పార్టీ అధిష్టానానికి సమస్య వస్తుందనే భయంతో అంబేద్కర్‌పై జరుగుతున్న అవమానాలను ప్రశ్నించకపోవడం సిగ్గుచేటని హనుమంతు విమర్శించారు. దళిత, గిరిజన, బీసీ నాయకులు తమ పదవుల కోసం కాకుండా తమ సామాజిక వర్గాల ఆత్మగౌరవం కోసం మాట్లాడాలని డిమాండ్ చేశారు గౌతమ బుద్ధుడు, బసవన్న, జ్యోతిరావు పూలే, పెరియార్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి సామాజిక సంస్కర్తలను లక్ష్యంగా చేసుకుని పదేపదే విషపూరిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై ప్రభుత్వాలు ఇక మౌనం వీడాలని కోరారు. భావప్రకటన స్వేచ్ఛ పేరుతో రాజ్యాంగ విలువలను, మహనీయుల గౌరవాన్ని, సామాజిక వర్గాల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలను అనుమతించకూడదని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి, చట్టాన్ని ఉల్లంఘించే వ్యాఖ్యలు లేదా చర్యలు ఉంటే నిష్పక్షపాతంగా విచారణ జరిపి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డి ఎచ్ పి ఎస్ డిమాండ్ చేస్తోంది. ఎవరైనా చట్టానికి అతీతులు కారని, రాజకీయ పలుకుబడి ఉన్నా చర్యల నుంచి తప్పించుకునే పరిస్థితి ఉండకూడదని హెచ్చరించారు. అంబేద్కర్‌ను అవమానిస్తే ఇక మౌనం కాదు --- రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో బలమైన ప్రతిఘటన తప్పదు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రజలు ఐక్యంగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని ఎం ఆర్ హనుమంతు అన్నారు.

సీమ వార్త

## ఘనంగా వినాయక పూజా కార్యక్రమం



**మడకశిర సెప్టెంబర్ 15 సీమ వార్త** నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం ఘనంగా వినాయక విగ్రహాల ఏర్పాటు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా యువకులు కేరింతలు వేస్తూ గణనాయకుని ఎంతో ఉత్సాహంగా కొలువు తీర్చడం జరిగింది.మండల పరిధిలోని జక్కేపల్లి గ్రామంలో నిర్వహించిన వినాయక పూజా కార్యక్రమంలో ఎ.పి. కుంచిటిగ వక్కలిగ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్. లక్ష్మీనారాయణ తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, విఘ్నాలు తొలగించే వినాయకుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డప్పు కళాకారుల పెన్షన్ తేదీని పొడిగించాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్




**మడకశిర సెప్టెంబర్ 15 సీమ వార్త** డప్పు కళాకారుల పెన్షన్ తేదీని పెంచాలని జిల్లా ఉపాధ్యక్షులు కే ఏ రామాంజనేయులు, యోగానంద కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘండిమాండ్ చేశారు. మంగళవార మండల కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించడం జరిగింది. కూటమి ప్రభుత్వం డబ్బు కళాకారులకు పెన్షన్ వదిలినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అయినా 8 రోజులు మాత్రమే పెన్షన్ గడువుఇచ్చినందువలన వాటిలో మూడు రోజులు సెలవులు రావడం వలనఈ మిగిలిన ఐదు రోజులు మాత్రమే ఉండడం వలన పెన్షన్ లబ్ధిదారులుచాలా ఇబ్బందులకు గురవుతున్నారు. అందులో అర్హత పత్రాలకు సంబంధించి 8 నుంచి 10 అర్హత పత్రాలు జత చేయాలి కొందరు చదువు లేని నిరుపేదలు వాటిని సరైన సమయానికి తెచ్చుకోకపోవడం పేద ప్రజలు పెన్షన్లు కోల్పోతున్నారునెల 25వ తేదీ వరకు పొడిగించాలని ఎంపీడీవో కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డబ్బు కళాకారులు సంగం మడకశిర రామప్ప, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి టి ఆర్ అంజి , బిఆర్ హనుమంతప్ప, డబ్బు కళాకారులు పాల్గొన్నారు.

## ఘనంగా గణపతి కి పూజలు.



**పెనుకొండ సెప్టెంబర్ 15 సీమవార్త.** పట్టణంలోని సర్వశెట్టి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్యులు వినాయక చవితి సందర్భంగా మంగళవారం గణపతికి పూజలు చేశారు. ఈ సందర్భంగా గణపతి కి పిండ వంటలు చేసి స్వామి వద్ద ఉంచి మొక్కులు తీర్చుకున్నారు. గణపతి ని మూడురోజులు పూజలు చేసి అనంతరం నిమజ్జనం చేయునున్నట్లు తెలిపారు.

## ప్రజా సేవలో అగ్రగామిగా ఫయాజ్ బాషా ట్రస్ట్

### సొంత నిధులతో సేవా కార్యక్రమాలు

**నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉచిత వైద్య పరీక్షలు** తాడిపత్రి, సెప్టెంబర్ 15 సీమ వార్త: ప్రజా సేవలో అగ్రగామిగా నిలుస్తూ ఫయాజ్ బాషా ట్రస్ట్ ప్రజల మన్ననలు పొందుతోంది. తాడిపత్రి పట్టణంలోని 12వ వార్డు పడమటి గేరిలో వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, ట్రస్ట్ చైర్మన్ హీరాపురం ఫయాజ్ బాషా తన సొంత నిధులతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. పట్టణంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్త పరీక్ష కేంద్రం నాలుగేళ్లు పూర్తి చేసుకుని ఐదవ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా సోమవారం కేంద్రంలో సిబ్బంది చేత కేక్ కట్ చేయించి ఫయాజ్ బాషా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలకు రక్త పరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలను నాలుగేళ్లుగా పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్నామని, మిగతా అన్ని పరీక్షలను నామమాత్రపు ఫీజుతో చేస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ కేవలం వైద్య సేవలకే పరిమితం కాకుండా సొంత నిధులతో అనేక సేవలు చేస్తోంది. టీబీ పేషెంట్లకు పౌష్టికాహారం కోసం నిత్యావసర సరుకుల పంపిణీ, నిర్మాణంలో ఉన్న మసీదులకు స్టీల్, సిమెంట్ అందించడం చేస్తోంది.

**ఆపదలో అండగా.. పేదలకు ఇంటి పట్టాల పంపిణీ**

ఆపదలో ఆదుకోవడంలో ఫయాజ్ బాషా ముందుంటారు. గతంలో కోట్లు విలువ చేసే తన సొంత స్థలాన్ని దాదాపు 250 మంది నిరుపేదలకు ఇంటి పట్టాలుగా వేసి, రోడ్లు వేయించి రిజిస్ట్రేషన్ చేయించి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ప్రతి ఏటా రంజాన్ పండుగకు నియోజకవర్గంలోని ఇమామ్ లకు 6500, మౌజమ్ లకు 3500 రూ చొప్పున .దాదాపు 6 లక్షల వరకు ఆర్థిక సహాయం, బట్టలు అందజేస్తున్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు సొంత నిధులతో బోర్లు వేయించి, సింటెక్స్ ట్యాంకులు, కొత్త కుళాయిలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చారు. ఫయాజ్ బాషా ట్రస్ట్ వల్ల పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేసే పరీక్షలు తక్కువ ఖర్చుతో అందుతున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్య పరిరక్షణకు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని యువతకు పిలుపుఖ

### లిడ్కర్ చైర్మన్ ముంద్రగి నాగరాజ్

### బళ్లారిలో అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ వేడుకలు

**బళ్లారి, సెప్టెంబర్15 సీమవార్త:** ప్రజాస్వామ్య మరియు రాజ్యాంగ విలువల పరిరక్షణ బాధ్యత నేటి యువతపైనే ఉందని లిడ్కర్ అధ్యక్షుడు ముంద్రగి నాగరాజ్ పిలుపునిచ్చారు. యువత మొబైల్ ఫోన్ల వ్యామోహాన్ని వీడి, పుస్తక పఠన అలవాటును మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఆయన కోరారు. నగరంలోని జోలదరాశి దొడ్డనగౌడ రంగ మందిరంలో మంగళవారం జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ మరియు సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ' వేడుకలు మరియు యువతకు దేశ పార్లమెంటరీ వ్యవస్థపై అవగాహన కల్పించే 'యూత్ పార్లమెంట్' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. గతంలో రాచరిక వ్యవస్థలో రాజులు కేవలం రాణులకే జన్మించేవారని ఆయన గుర్తుచేశారు. అయితే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమానత్వం ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించి, ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం ద్వారా అధికారం బ్యాలెట్ బాక్స్ ద్వారానే నిర్ణయించబడేలా చేశారని ఆయన పేర్కొన్నారు. సాధారణ గ్రామ పంచాయతీ సభ్యుడి నుండి ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి మరియు రాష్ట్రపతి వరకు అందరూ ప్రజాస్వామ్య బ్యాలెట్ బాక్స్ ఫలితంగానే తమ పదవులను అధిష్ఠిస్తున్నారని చెబుతూ, రాజ్యాంగ నిర్మాతకు ఆయన నివాళులర్పించారు. బాబాసాహెబ్ రెండేళ్ల, పదకొండు నెలల, పద్దెనిమిది రోజుల సుదీర్ఘ కృషి ఫలితంగా రూపొందించిన రాజ్యాంగం వల్లే నేడు మనం సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ సమానత్వాన్ని అనుభవిస్తున్నామని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో, కళాశాలల్లో రాజ్యాంగ పఠనం మరియు 'యూత్ పార్లమెంట్' తరహా కార్యక్రమాలను మరింతగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. యువత సమాజానికి భయపడకుండా, సమాజమే తమను గౌరవించే స్థాయికి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని ఆయన సూచించారు. 'రీల్స్' మరియు సోషల్ మీడియాలో సమయాన్ని వృథా చేయడం మానేసి, బలమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించడానికి అవసరమైన దూరదృష్టి, నిజాయితీ, ఆత్మవిశ్వాసం, సంభాషణా నైపుణ్యాలు మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నగర కార్పొరేషన్ మేయర్ పి. గాదెప్ప మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలోని





బృందం రూపొందించిన రాజ్యాంగం... నేడు భారతదేశంలో మనమందరం స్వేచ్ఛగా, సురక్షితంగా మరియు మన ఇష్టానుసారం జీవించగలుగుతున్నామంటే దానికి ప్రధాన కారణం అంబేద్కరే. దేశంలోని తదుపరి తరం వారి ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, బాబాసాహెబ్ అంబేద్కర్ తన ఆహారం, నిద్ర మరియు కనీస సౌకర్యాలను సైతం పక్కనపెట్టి భరించిన అపారమైన శ్రమ, కష్టాల ఫలితమే నేడు మనం చూస్తున్న సుస్థిరమైన భారతదేశం అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిసి కె. నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అత్యుత్తమ పాలనా విధానమని అన్నారు. వివిధ పాలనా విధానాలను లోతుగా అధ్యయనం చేసిన తర్వాత, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారతదేశానికి ప్రజాస్వామ్యమే అత్యుత్తమ విధానమని స్పష్టంగా సిఫార్సు చేశారు. రాజ్యాంగం ద్వారా, ఎటువంటి వివక్షకూ తావులేకుండా ప్రతి పౌరుడికి "ఒక వ్యక్తి – ఒక ఓటు" అనే సమాన హక్కును అంబేద్కర్ కల్పించారని ఆయన గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే కేంద్ర బిందువు. ప్రభుత్వం మరియు పౌరులు వేర్వేరు కాదు; ప్రభుత్వం ప్రజలదే. ఎన్నికైన ప్రతినిధులు లేదా పాలన సరిగా లేనట్లయితే, వారిని మార్చే సంపూర్ణ అధికారం పౌరులకు ఉంటుంది. ఎన్నికల రోజును కేవలం ఇంట్లో గడిపే సెలవు దినంగా భావించకుండా, తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచి ప్రభుత్వాన్ని మరియు సమర్థులైన ప్రతినిధులను ఎన్నుకోవాలని ఆయన అందరికీ సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య విలువలను పెంపొందించేందుకు ఐక్యరాజ్యసమితి సాధారణ సభ సెప్టెంబర్ 15ను 'అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం'గా ప్రకటించింది. ఈ నేపథ్యంలో, విద్యార్థులలో ప్రజాస్వామ్య సూత్రాలు మరియు పార్లమెంటరీ కార్యకలాపాలపై అవగాహన కల్పించేందుకు మొదటిసారిగా 'యూత్ పార్లమెంట్'తో సహా వివిధ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఈ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారని, అలాగే నవంబర్ 26న జరగబోయే 'రాజ్యాంగ దినోత్సవం'ను అర్థవంతంగా జరుపుకోవడానికి కలిసి కృషి చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ సీఈఓ మహమ్మద్ హారిస్ సుమేర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడం మాత్రమే కాదని, అది సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ న్యాయాలను కూడా కలిగి ఉంటుందని అన్నారు. సామాజిక న్యాయమే ప్రజాస్వామ్యానికి నిజమైన ప్రాణాధారం అని ఆయన నొక్కి చెప్పారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులతో పాటు, పౌరులు తమ ప్రాథమిక విధులను కూడా విస్మరించకూడదని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని చెబుతూ, విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించి దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత మరియు బహిరంగ జీవితాల్లో రాజ్యాంగ విలువలను గౌరవించి, వాటికి కట్టుబడి ఉన్నప్పుడే భారతదేశం 'విశ్వ గురువు'గా (ప్రపంచ నాయకుడిగా) ఎదగగలదని మరియు సుస్థిర అభివృద్ధిని సాధించగలదని ఆయన అభిప్రాయపడ్డారు. కంప్లిలోని ప్రభుత్వ బాలుర ప్రీ-యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సిద్ధన్న పరమేశ్వర్ ప్రజాస్వామ్య ఆదర్శాలపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పీఠికను పఠించారు. అంతకుముందు, ప్రముఖులు 'యువ పార్లమెంట్'కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్యారంటీ యోజనల అమలు ప్రాధికారం ప్రాధికార సంస్థ చైర్మన్ కె.ఇ. చిదానందప్ప, అదనపు ఎస్పీ నవీన్ కుమార్, నగర కార్పొరేషన్ కమిషనర్ పి.ఎస్. మంజునాథ్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చిదానందప్పతో పాటు వివిధ దళిత సంఘాల ప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# తోటి విద్యార్థి కుటుంబానికి 50వేలు ఆర్థిక సహాయం చేసిన పూర్వ విద్యార్థులు


**అమరాపురం సెప్టెంబర్ 15:సీమవార్త** మండల పరిధిలోని కే శివరం పంచాయతీ కె కె హట్టి గ్రామానికి చెందిన 2001-02 సంవత్సరం పూర్వ విద్యార్థి నాగభూషణం గతకొద్ది రోజుల క్రితం అనారోగ్య కారణంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న తోటి పూర్వ విద్యార్థులు సమ్మేళనంతో 50వేలు నగదును అందజేసి తోటి స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. కష్టాల్లో ఉన్న స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు మేమున్నామంటూ పూర్వ విద్యార్థులు చేయి చేయి కలిపి కుటుంబానికి బాసటగా నిలిచారు. చదువుకున్న రోజుల్లో పంచుకున్న జ్ఞాపకాలు, స్నేహ బంధం ఎప్పటికీ విడిపోనిదని నిరూపించారు. అకాల మరణం చెందిన తమ తోటి విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక హేమావతి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన నాగభూషణం గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో అకాల మరణం చెందారు. నాగభూషణం మరణంతో అతని కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. అతనికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ఆధారం కావలసిన వ్యక్తి దూరమవడంతో ఆ ఇల్లు ఇబ్బంది పాలైయింది. ఈ విషయం తెలుసుకున్న మృతుడి పూర్వ విద్యార్థులు వెంటనే స్పందించారు. వాట్సాప్ గ్రూప్ ద్వారా ఒకరినొకరు సంప్రదించుకుని, స్నేహితుడి కుటుంబాన్ని



ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. తమకు తోచినంతగా విరాళాలు సేకరించి, కేవలం కొద్ది రోజుల్లోనే రూ. 50వేలు డిపాజిట్ చేసి బాండు ను ఆదివారం నాడు నాగభూషణం స్వగృహానికి వెళ్లి అతని భార్య కావ్య, పిల్లలు కుమారుడు మధు కుమార్తె మైత్రి కి అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. "నాగభూషణం మరణం మా అందరినీ తీవ్రంగా కలిచివేసింది. ఆర్థిక సహాయం అతని స్థానాన్ని భర్తీ చేయలేకపోయినా, అతని కుటుంబానికి కొండంత అండగా ఉంటుందనే ఉద్దేశంతోనే ఈ చిన్న ప్రయత్నం చేశాం. భవిష్యత్తులోనూ ఆ పిల్లల చదువులకు మా వంతు సహాయం అందిస్తాం అని భావోద్వేగంతో తెలిపారు. నాగభూషణం భార్య కావ్య మాట్లాడుతూ ఆపద సమయంలో నా భర్త స్నేహితులు వచ్చి, ఇంత పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం అందించి ఆదుకోవడంపై నాగభూషణం కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. తోటి స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులపై స్థానికులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

**టి సుండుపల్లి, సెప్టెంబర్15** సీమ వార్త మండల పరిధిలోని చెరుకువాండ్లపల్లెకు చెందిన,చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా, ఎన్‌సీసీ అధికారిగా సేవలందిస్తున్న పసుపుల రాజశేఖర్ జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.నెల్లూరు జిల్లా కోట మండల కేంద్రంలోని రెడ్డి కళ్యాణ మండపంలో ఎం.వి. రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఎంవి రావు ఫౌండేషన్ ప్రతిభా పురస్కారాలు 2026 లో భాగంగా ఈ అవార్డును ఆయనకు అందజేశారు.ఎం.వి. రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు అయిన ఎన్.బి.కె.ఆర్. ఐ.ఎస్.టి. డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, ప్రముఖ కవి, రచయిత చిల్లకూరు ఆదినారాయణ రెడ్డి, సత్తివేడు మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులం ప్రిన్సిపాల్ నారాయణస్వామి మొదలగు వారి చేతుల మీదుగా ప్రశంసా పత్రం, షీల్డ్ మరియు గోల్డ్ మెడల్ తో సత్కరించడం జరిగింది.ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించడంలో పసుపుల రాజశేఖర్ చేస్తున్న సేవలకు గాను ఈ పురస్కారం అందిందన్నారు.జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం పట్ల మండల ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేసి పసుపుల రాజశేఖర్‌ను అభినందించారు.



# నిబంధనలు మూడు అడుగులు.. తవ్వకాలు పది అడుగులు!





**ఇసుక తవ్వకాలకు రైతుల అడ్డుకట్ట.. రీచ్ నిలిపివేయాలని డిమాండ్**

**పాపాగ్నిలో లోతుకు వెళ్లిన ఇసుక తవ్వకాలు.. నీటి కోసం రైతుల ఆందోళన**

**ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలపై భారం.. రీచ్ నిలిపివేయాలని రైతుల వినతి**

**పంటలకు నీటి కరువు.. ఇసుక రీచ్‌పై రైతుల నిరసన**

**పాపాగ్ని ఇసుక తవ్వకాలపై రైతుల కన్నెర్ర.. తహసీల్దార్‌కు వినతి**

**వేంపల్లె, సెప్టెంబర్ 15, సీమవార్త :** వేంపల్లెలో పాపాగ్ననదిలో కొనసాగుతున్న ఇసుక రీచ్‌ను తక్షణమే నిలిపివేయాలని జడ్పిటిసి రవికుమార్ రెడ్డి వైకాపా నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. ఇసుక తవ్వకాలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ మంగళవారం రీచ్ వద్ద రైతులు నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ శివశంకర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పాపాగ్ననదిలో ఇసుకను పరిమితికి మించి లోతుగా తవ్వుతున్నారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం మూడు అడుగుల మేర మాత్రమే ఇసుక తవ్వాల్సి ఉండగా, సుమారు 10 అడుగుల లోతు వరకు తవ్వకాలు సాగుతున్నాయని తెలిపారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి పంట పొలాల్లోని బోర్ల నుంచి నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**బోర్లలో నీళ్ల కరువు.. రైతుల్లో ఆందోళన**

ఇప్పటికే వర్షాభావ పరిస్థితులతో సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీనికి తోడు నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని రైతులు వాపోయారు. ఇసుక తవ్వకాలు ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు మరింత అడుగంటి, పంటలు ఎండిపోయి తీవ్ర ఆర్థిక నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. 14 గ్రామాల తాగు, సాగునీటిపై ప్రభావం? పాపాగ్ని నదిపై ఆధారపడి సుమారు 14 గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందుతున్న నేపథ్యంలో ఇసుక తవ్వకాలపై అధికారులు సమగ్రంగా పరిశీలన చేయాలని వారు కోరారు. ప్రజల తాగునీరు, రైతుల సాగునీటి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇసుక రీచ్‌ను తక్షణమే నిలిపివేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతుల ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి.. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయా? లేదా? అన్నది తేల్చాలని, ఉల్లంఘనలు ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ఎం.రవికుమార్ రెడ్డి, వైసీపీ కన్వీనర్ కె.చంద్రఓబుల్ రెడ్డి, ఉపాధ్యక్షులు మునీర్, రవిశంకర్ గౌడ్, నాయకులు రెడ్డయ్య, నరసింహగౌడ్, ప్రసాద్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 76వ జన్మదిన వేడుకలు.



**పెనుకొండ సెప్టెంబర్ 15 సీమవార్త.** పట్టణంలోని బాలురు గురుకుల హాస్టల్ లో మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీ 25 ఏళ్లు ప్రజాసేవ పాలన సంకల్పం అభినయ్ కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ ఎస్సిమోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఫనతల సురేష్ పిలుపుమేరకు 200 మంది విద్యార్థులతో పోస్టల్ కార్డు ద్వారా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కార్డులను పోస్టర్ ద్వారా ప్రధానమంత్రి కార్యాలయానికి పంపించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అనంతపురం ఇన్చార్జి ఎనుముల రామకృష్ణ మండల అధ్యక్షురాలు మమత సీనియర్ నాయకులు అంగడి రామాంజనేయులు,ఎం రవి, హనుమంతు యాదవ్, మధుసూదన్, వేద వ్యాష్, ముత్యాలమ్మ, సుభద్రమ్మ, త్రినాథ్,ఎత్తి రాజు, మునిమడుగు వెంకటరాముడు, గోవిందు, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు మరియు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## సోమలరాజుగారి పల్లెదారి సమస్య పరిష్కారం

**టిడిపి నాయకులు చప్పిడి మహేష్ నాయుడు**

**టి సుండుపల్లె సెప్టెంబర్ 15సీమ వార్త** మండల కేంద్రానికి సమీపంలోని సోమలరాజుగారి పల్లెలో గత ఏడాది క్రితం నుండి దారి సమస్యతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఈ విషయాన్ని టీడీపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్ నాయుడు దృష్టికి తీసుకెళ్ళగా వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లి దారి సమస్యను మంగళవారం శాశ్వతంగా పరిష్కరించారు. గత సంవత్సర కాలంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని గ్రామస్తులు టిడిపి నాయకులు మహేష్ నాయుడుతో పాటు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా జరిగిన ఇంజనీర్స్ డే వేడుకలు.. ప్రిన్సిపాల్ సురేష్ బాబు




**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 15 సీమవార్త :** ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీర్స్ డే వేడుకలు ప్రిన్సిపాల్ సురేష్ బాబు, ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొనడం పట్ల పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ధర్మవరం పాలిటెక్నిక్ కు ఎన్బీఏ వచ్చిన సందర్భంగా వారు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలను తెలిపారు. మంత్రి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ తను కూడా పాలిటెక్నిక్ విద్యార్థి అని, తన విద్యార్థిదశలోని జ్ఞాపకాలను గుర్తుచేసుకొని, ప్రతివిద్యార్థి ఒక లక్ష్యంతో ముందుకు కదలాలని అప్పుడే ప్రగతి పథం లో పయనిస్తారని తెలిపారు. తదనంతరం ఇంజనీర్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కేకు కట్ చేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య అడుగుజాడల్లో అందరూ నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమములో శాఖఅధిపతులు బాలస్వామి, హరిబాబు, అధ్యాపకులు కళ్యాణి, బాలాజోషి మొదలగు సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు సమస్య కు పరిష్కారం.



**పెనుకొండ సెప్టెంబర్ 15 సీమవార్త.** మండలంలోని మావటూరులో ఆంజనేయస్వామి ఆలయం వద్ద రహదారి, డ్రైనేజీ లేక గ్రామస్థులు చాల ఇబ్బందులు పడుతుండేవారు. విషయాన్ని గ్రామస్థులు మంత్రి సవితమ్మ దృష్టి కి తీసుకెళ్ళగా స్పందించి న మంత్రి వెంటనే రహదారి పనులు ప్రారంభించాలని నాయకులకు సూచించారు.. ఈ సందర్భంగా మంగళవారం టీడీపీ నాయకులు గ్రామానికి వెళ్ళి రహదారి పనులను పరిశీలించారు.కార్యక్రమం లో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, సింగిల్ విండో అధ్యక్షులు పోతిరెడ్డి,రూరల్ కన్వీనర్ దండు ఈశ్వర ప్రసాద్. నాగలూరు నారాయణ స్వామి, మావటూరు గోపాల్ తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## బళ్లారి రూరల్ ఎమ్మెల్యే బి. నాగేంద్ర గారి పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు



**గుంతకల్ సెప్టెంబర్ 15 సీమా వార్త** గుంతకల్ శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం పెద్దమ్మ కుమారుడు, బళ్లారి రూరల్ ఎమ్మెల్యే బి. నాగేంద్ర పుట్టినరోజు సందర్భంగా బళ్లారి పట్టణంలోని ఉడిపి హాస్పిటల్ నందు గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గుంతకల్ మండలం ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి గారు మరియు బి. నాగేంద్ర గారి అన్న బి. రాంప్రసాద్ పాల్గొన్నారు.

## నందీశ్వర్ ఆధ్వర్యంలో వినాయకుని ప్రత్యేక పూజలు పాల్గొన్న ఎమ్మెల్యే



**గుంతకల్ సెప్టెంబర్ 15 సీమా వార్త** గుంతకల్ వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గుంతకల్ పట్టణం 31,32 వార్డుల నందు టీడీపీ నాయకుడు వార్డ్ ఇంచార్జ్ బోయ నందీశ్వర్ ప్రత్యేక ఆహ్వానం మేరకు వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించిన గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం మరియు ఆయన సోదరులు గుంతకల్లు మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి ఈ కార్యక్రమంలో గుంతకల్లు పట్టణ మరియు మండల కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా గణపతి కి పూజలు.



**పెనుకొండ సెప్టెంబర్ 15 సీమవార్త.** పట్టణంలోని సర్వశెట్టి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్యులు వినాయక చవితి సందర్భంగా మంగళవారం గణపతికి పూజలు చేశారు. ఈ సందర్భంగా గణపతి కి పిండ వంటలు చేసి స్వామి వద్ద ఉంచి మొక్కులు తీర్చుకున్నారు. గణపతి ని మూడురోజులు పూజలు చేసి అనంతం నిమజ్జనం చేయునున్నట్లు తెలిపారు.

## జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం.



**బుక్కపట్నం సెప్టెంబర్ 15 సీమవార్త.** జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం బుక్కపట్నంలో ఘనంగా నిర్వహించారు.జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ప్రశాంత్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి టి.జి. వెంకటేష్, పల్లె సింధూర, పల్లె రఘునాథ్ రెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇల్లూరి లక్ష్మయ్య, రాష్ట్ర వాసవి దళ్ అధ్యక్షులు శబరి వరప్రసాద్ తదితర ప్రముఖులు హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. పెనుకొండ నుంచి జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు కె. శబరీష్ , ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యాడికి నాగరాజు, వాసవి సేవాదళ్ అదనపు కార్యదర్శి గుండ శ్రీకాంత్, మైలవరం సూర్యనారాయణ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సమాజ అభ్యున్నతి, యువత సంక్షేమం, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని నాయకులు ఆకాంక్షించారు.

## జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం.




**బుక్కపట్నం సెప్టెంబర్ 15 సీమవార్త.** జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మంగళవారం బుక్కపట్నంలో ఘనంగా నిర్వహించారు.జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ప్రశాంత్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి టి.జి. వెంకటేష్, పల్లె సింధూర, పల్లె రఘునాథ్ రెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఇల్లూరి లక్ష్మయ్య, రాష్ట్ర వాసవి దళ్ అధ్యక్షులు శబరి వరప్రసాద్ దితర ప్రముఖులు హాజరై నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. పెనుకొండ నుంచి జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు కె. శబరీష్ , ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యాడికి నాగరాజు, వాసవి సేవాదళ్ అదనపు కార్యదర్శి గుండ శ్రీకాంత్, మైలవరం సూర్యనారాయణ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సమాజ అభ్యున్నతి, యువత సంక్షేమం, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని నాయకులు ఆకాంక్షించారు.

## పెన్షన్ దారులకు గడువు పెంచాలి సిపిఐ ఏరియా కార్యదర్శి వెంకట రాములు డిమాండ్

**పులివెందుల సెప్టెంబర్ 15 (సీమ వార్త)** వారం వ్యవధిలో ప్రభుత్వ సర్టిఫికెట్లు ఎలా వస్తాయి కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇబ్బందులను గుర్తించి గడువు పెంచే ఆలోచన చేయాలని సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త పింఛన్లకు అవకాశం కల్పించడం సంతోషకరమే కానీ వారికి ఇచ్చిన గడువు కుల ధ్రువీకరణ పత్రం, ఇన్కమ్ సర్టిఫికెట్, ప్రభుత్వ అధికారులు ఇవ్వాలంటే 30 రోజులు గడువు ఉంటుంది అదికాక మూడు రోజులు నాలుగు రోజులు సెలవులు ఉండడం,సెలవులు అయిపోతే గడువు కూడా అయిపోతుంది అలాంటప్పుడు పెన్షన్ దారులకు మీరు ఎలా న్యాయం చేస్తారు ఒకసారి రాష్ట్ర ప్రభుత్వం పునర్ ఆలోచన చేసి గడువు నెల రోజులు ఇవ్వాలని, తెలిపారు. సచివాలయంలో, తాసిల్దార్ కార్యాలయంలో విఆర్వోలు, ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉండాలని తెలిపారు అలాగే తాసిల్దార్ కార్యాలయంలో సర్వరు ప్రాబ్లం, ఆన్లైన్ పనిచేయడం లేదు, సిస్టం సరిగా లేదు అని సచివాలయం సిబ్బంది పెన్షన్ దారులు వృద్ధులు, వికలాంగులను,, దళిత డప్పు కళాకారులు, చర్మకారులకు సమయం తక్కువ ఉన్నందువలన అప్లై కూడా చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నామని వారు ఆవేదన పొందుతున్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్క పింఛన్దారునికి పెన్షన్ ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని,సచివాలయానికి కొన్నే అని, ఆంక్షలు పెట్టి, అర్హులైన వారి నోట్లో మట్టి కొట్టవద్దని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శి కొత్త కాలువ బ్రహ్మం వేముల మండల కార్యదర్శి చాంద్ బాషా వేంపల్లి నాయకులు జకరయ్య పులివెందుల నాయకులు సుభాన్ రూప కాంత్ తదితరులు పాల్గొన్నారు.



## వినాయక చవితి ను సందర్శించిన చిలకం దంపతులు



**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 15 సీమవార్త :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ఆయన సతీమణితో కలిసి ధర్మవరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను దర్శించుకొని ,ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా కొత్తపేటలో సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ కమిటీ వారి ఆహ్వానం మేరకు ఏర్పాటు చేసిన వినాయకుడిని, అలాగే సాయినగర్, పార్థసారధి నగర్, శివరాం నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పలు వినాయక విగ్రహాలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకమ్ మధుసూదన్ రెడ్డి దంపతులు ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంజినీర్స్ డేలో ఇంజినీర్లకు ఘన సన్మానం



**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 15 సీమవార్త :** ఇంజినీర్స్ డే సందర్భంగా రిషి విద్యాలయ ఐఐటి అండ్ ఎన్ ఈ టి ఫౌండేషన్ స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఇంజినీర్లను పాఠశాల విద్యార్థులు ఇంజినీర్లను ఆత్మీయంగా కలిసి, పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఇంజినీర్లకు ఇంజినీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేసి, వారి సేవలను కొనియాడారు. విద్యార్థులు ఇంజినీర్లతో ముచ్చటించి, వారి విద్యా ప్రయాణం, వృత్తి అనుభవాలు, బాధ్యతలు, సాంకేతిక రంగంలో ఎదురయ్యే సవాళ్లు, భవిష్యత్ అవకాశాల గురించి ఆసక్తిగా తెలుసుకున్నారు. విద్యార్థులు మాట్లాడుతూ, "దేశ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఇంజినీర్లు చేస్తున్న సేవలు, కొత్త ఆవిష్కరణలు మాకు ఎంతో స్ఫూర్తినిస్తున్నాయి. వారి అనుభవాల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాం. భవిష్యత్తులో మేము కూడా కష్టపడి చదివి, మంచి ఇంజినీర్లుగా ఎదిగి దేశ అభివృద్ధికి మా వంతు సేవ చేస్తామని తెలిపారు. డీన్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర అమూల్యమైనదని, అన్నారు. సీఈవో రవీంద్ర, ప్రిన్సిపాల్ గోపీనాథ్, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో భవిష్యత్తులో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు.ఇంజినీర్లు దేశ అభివృద్ధికి వెన్నెముక లాంటివారని తెలిపారు.

## అగాపే ఆశ్రమంలో వర్ధంతి సందర్భంగా అన్నదానం



**యాడికి సెప్టెంబర్ 15 ( సీమ వార్త )** యాడికి మండలం కేంద్రం కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీ లో ఉన్న అగాపే ఆశ్రమంలో కోడూరు శివారెడ్డి 2వ వర్ధంతిని జ్ఞాపకం చేసుకుంటూ ఆయన భార్య లక్ష్మీనారాయణమ్మ కుమారులు వేణుగోపాల్ రెడ్డి భాను ప్రకాశ్ రెడ్డి వీరి కుటుంబము అన్నదానం ఏర్పాటు చేశారు గతంలో కూడా మొదట వర్ధంతి నిమిత్తమై అన్నదానం చేసినట్టుగా ఫౌండర్ గారు సెలవిచ్చారు ఈసారి కూడా ఆశ్రమంలో ఉంటున్న వారికి కోడూరు శివారెడ్డిని జ్ఞాపకం చేసుకుంటూ భోజనాలు సిద్ధం చేయించి పెద్దలకు నిరాశ్రయులకు కుటుంబమంతా కలసి అన్నదానం చేశారు ఇందు నిమిత్తమై ఆశ్రమ పౌండర్ బత్తల ప్రసాద్ ఆశ్రమంలోని వారంతా వారి కుటుంబమంతటికి ధన్యవాదలు తెలిపారు.

## ప్రజుక్తి పెయింట్ షాప్ లో చోరీ.

**గోరంట్ల సెప్టెంబర్ 15 సీమ వార్త** పట్టణంలోని జియో ఆఫీస్ బిల్డింగ్ సెల్లార్ లో ఉన్న ప్రజుక్తి పెయింట్ షాప్ లో చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. షాపు యజమాని భాను ప్రకాష్ రోజువారి విధి నిర్వహణలో భాగంగా మధ్యాహ్నం భోజనానికి వెళ్లిన సందర్భంలో ఒక దొంగ కొడుకు షాప్ లోకి ంచొరబడి క్యాష్ డ్రా లో ఉన్న నగదును అపకరించిన సంఘటన సి సి ఫుటేజీలో రికార్డు అయింది. దుండగుడు ఏదేచ్ఛగా ప్రధాన ద్వారం తెరిచి లోపలికి తరబడి చోరీ చేసి అనంతరం ఆ ప్రధాన ద్వారానే అలాగే మూసివేసి కూడా ఇచ్చిన సంఘటన చోటుచేసుకుంది.




## అత్యాచార నిందితుడి అరెస్ట్.

**క్రైమ్ న్యూస్ పావగడ: సెప్టెంబర్ 15 సీమ వార్త.** పావగడ:: మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని అరసీకెరె పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన నిందితుడిని తాలూకాలోని గౌడ కారనాగనహట్టికి చెందిన యరగుంటప్ప (45) గా గుర్తించారు. సోమవారం తుమకూరు నుండి వచ్చిన మహిళ పెమ్మనహళ్లి గొల్లరహట్టి గేట్ వద్ద బస్సు దిగి, తన పుట్టింటి ఊరైన కారనాగనహట్టికి నడుచుకుంటూ వెళు ండగా, వాగు దగ్గర నిందితుడు అత్యాచారం చేశాడని ఆరోపిస్తూ అరసీకెరె పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు భారతీయ న్యాయ సంహిత (దీచీూ) సెక్షన్ 64(1) కింద కేసు నమోదైంది

## ఘనంగా ప్రారంభమైన శ్రీ రంగనాథ స్వామి నూలు పూజ ఉత్సవాలు



**పులివెందుల సెప్టెంబర్ 15 (సీమ వార్త):** పులివెందులలో పురాణం ప్రసిద్ధి చెందినటువంటి శ్రీ రంగనాథ స్వామి వారి నూలు పూజా ఉత్సవాలు మంగళవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ అర్చకులు కృష్ణరాజశ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ చింతకుంట సుధాకర్ రెడ్డి, ఒనిడా సుబ్బారెడ్డి, శ్రీ అంకాలమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, దినేష్ మెడికల్ స్టోర్ అధినేత దినేష్ కుమార్ గుప్తా ,శ్రీ చైతన్య కళాశాలల అధినేత ఆరవేటి నారాయణరెడ్డి ,ఆలయ ఈఓ కె.వి.రమణ ,ఆలయ మాజీ ధర్మకర్తలు పట్టాభి రామయ్య, దశావతారామిరెడ్డి, చల్లా చంద్రశేఖర్ నాయుడు, సీనియర్ జర్నలిస్టు ,శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు రాయల్ , పలువురు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని హనుమద్ వాహనంపై ఉంచి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉభయ దారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ దేవస్థానం చైర్మన్ పబ్బతి నారాయణ కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## కాకతీయ విద్యానికేతన్ నందు ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు



**ధర్మవరం సెప్టెంబర్ 15 సీమవార్త :** ౦౦ పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ నందు ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి డైరెక్టర్లు శెట్టిపి పద్మ ,శెట్టిపి సూర్య ప్రకాష్ రెడ్డి , శెట్టిపి హర్జిత్ ప్రణవ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 15న భారతరత్న, గొప్ప ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డే జరుపుకుంటున్నామని



తెలిపారు.విశ్వేశ్వరయ్య 1861 సెప్టెంబర్ 15న కర్ణాటకలో జన్మించారు అని,దేశానికి ఎన్నో డ్యామ్ లు, బ్రిడ్జిలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు కట్టారు అని తెలిపారు. కృష్ణరాజ సాగర్ డ్యామ్ ఆయన కట్టిందే నని తెలిపారు. ఇంజనీర్లందరి కృషిని గుర్తించి, గౌరవించే రోజు. మనం వాడే రోడ్లు, భవనాలు, ఫోన్లు, సాఫ్ట్‌వేర్ – అన్నీ ఇంజనీర్ల కష్టఫలితమే నని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా 34 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలందించి పదవి విరమణ చేసిన రిటైర్డ్ సూపర్డెంట్ ఇంజనీర్( ఎస్ ఈ) గాజుల నాగ మోహన్ నీ కాకతీయ విద్యానికేతన్ పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయుల, విద్యార్థుల సమక్షంలో ,ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారూ.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయి బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్

### మండల కమిటీ ఎన్నిక



**సోమందేపల్లి సెప్టెంబర్ 15 సీమ వార్త** మండల కేంద్రంలోని స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ లో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ పెనుకొండ నియోజకవర్గం అధ్యక్షులు పోతులయ్య ఆధ్వర్యంలో సోమందేపల్లి మండలం జర్నలిస్ట్ ఫెడరేషన్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో మండల కమిటీ గౌరవాధ్యక్షులు వాసుదేవ, అధ్యక్షులుగా రవీంద్రబాబు, ఉపాధ్యక్షులు మారుతి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మంజునాథ శెట్టి, కార్యదర్శి మనోహర్, కోశాధికారి వడ్డే కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అలాగే మరి కొంతమంది సభ్యత్వాలను నమోదు చేసుకున్నారు. అనంతరం పోతులయ్య మాట్లాడుతూ విలేకరుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని అక్రిడేషన్, గృహ నిర్మాణం, తదితర విలేకరులకు సంబంధించిన పథకాలను అందరికీ అందే విధంగా చూస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, సాయి ప్రసాద్, శివయ్య, మురళి, వడ్డే శ్రీనివాసులు , హరినాథ్, మధుసూదన్ రెడ్డి, కడపల్లి శ్రీనివాసులు, వేణు, తదితర పాత్రికేయులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రజలు శాంతియుతంగా సహకరించాలి

### గుంతకల్లు పట్టణంలో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు



**గుంతకల్ సెప్టెంబర్ 15 సీమా వార్త** గుంతకల్లు పట్టణంలో నిర్వహించనున్న వినాయక నిమజ్జనం కార్యక్రమం సందర్భంగా పట్టణ ప్రజలు, భక్తులు మరియు వినాయక విగ్రహాల నిర్వాహకులు పోలీస్ శాఖ సూచించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గుంతకల్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా అధిక శబ్దాలతో కూడిన డీజేలను ఏర్పాటు చేయరాదని, అలాగే ఊరేగింపు వాహనాల వెంట ఎవరూ మద్యం సేవించి పాల్గొనరాదని పోలీసులు సూచించారు.ఊరేగింపు సమయంలో రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు వినిపించరాదని, రాజకీయ పార్టీల జెండాలను ఊరేగింపు వాహనాలకు కట్టరాదని స్పష్టం చేశారు. ఎవరూ ఇతరులకు ఇబ్బంది కలిగించేలా లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించరాదని సూచించారు.నిమజ్జనం ఊరేగింపులో పాల్గొనే ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖ సూచించిన ట్రాఫిక్ నిబంధనలు మరియు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.వినాయక విగ్రహాలను తీసుకువెళ్లే ప్రతి వాహనం వెంట సంబంధిత విగ్రహ కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఉండాలని, ఊరేగింపు సజావుగా జరిగేలా పోలీస్ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

**డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ**

వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని గుంతకల్ పట్టణ పోలీస్ సిబ్బంది డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుంది.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తించినా, పోలీస్ శాఖ సూచనలను ఉల్లంఘించినా, అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.కట్టుదిట్టమైన బందోబస్తు.వినాయక నిమజ్జనం కార్యక్రమం సందర్భంగా గుంతకల్లు పట్టణంలో అనంతపురం జిల్లా పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది మరియు ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందితో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుంది.వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని శాంతియుతంగా, సురక్షితంగా మరియు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు నగర ఉత్సవ సమితి, పట్టణ ప్రజలు, భక్తులు మరియు నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని గుంతకల్ పట్టణ పోలీస్ శాఖ విజ్ఞప్తి.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు మనోహర్, వంశీకృష్ణ, ప్రవీణ్ కుమార్ ఎస్సైలు బాలముని, కళ్యాణ్ మరియు నగర ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల రెన్యువల్, గెజిట్ విడుదల.. ఎక్సైజ్ సి.ఐ చంద్రమణి



**ధర్మవరం సెప్టెంబర్ 15 సీమవార్త :**అనంతపూర్ జిల్లా డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ , ఎక్సైజ్ శ్రీ ప్రసాద్ , జిల్లా ప్రొహిబిషన్ , ఎక్సైజ్ అధికారి నరసింహులు పుట్టపర్తి వారి ఆదేశాల మేరకు. 18 ఓపెన్ క్యాటగిరి 2 రిజర్వుడ్ కేటగిరి ల ధర్మవరము, ముదిగుబ్బ, తాడిమర్రి, బత్తలపల్లి మద్యం దుకాణాలు రెన్యువల్ నిమిత్తము గెజిట్ విడుదల చేయడం జరిగిందని ధర్మవరం ఎక్సైజ్ సీఐ ఎన్ చంద్రమణి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్సైజ్ కార్యాలయంలో లైసెన్సు మద్యం లైసెన్స్ దారులకు సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓపెన్ క్యాటగిరి, రిజర్వేషన్ కేటగిరి కింద మద్యం దుకాణాల యొక్క రెన్యువల్ ఫీజు, కట్టవలసిన లైసెన్స్ ఫీజు ఇతర వివరాలని వారికి క్షుణ్ణంగా వివరించడం జరిగిందన్నారు. సంవత్సరానికి 2026 - 27 లైసెన్స్ ఫీజును 4 వాయిదాలలో చెల్లించే అవకాశం ఉంటుంది అని తెలిపారు. పర్మిట్ రూమ్ మొత్తంను 3 వాయిదాలలో చెల్లించవచ్చు అని తెలిపారు . సెప్టెంబర్ నెల 21వ తారీకు సాయంత్రం 05 గంటల లోపల మద్యం దుకాణాల రెన్యూవల్ సరిపడా రుసుమును ప్రభుత్వం వారికి చెల్లించాల్సిందిగా సూచనలు ఇవ్వడం జరిగినది అని తెలిపారు.కాగా రెన్యువల్ కు ముందుకు రాని మద్యం దుకాణాలకు, సకాలంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజు చెల్లించని వాటికి వారి మద్యం లైసెన్సులు రద్దు చేసి, వాటి స్థానంలో సెప్టెంబర్ నెల 22వ తారీకు నుండి నూతన మద్యం షాపుల టెండర్లకు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు ఈ సమావేశంలో ఎస్సైలు చాంద్ బాషా, నాగరాజు, హెడ్ కానిస్టేబుల్లు, కానిస్టేబుల్లు, మద్యం దుకాణాల వారు పాల్గొన్నారు.

## శ్రీ రంగనాథ స్వామి ఆలయానికి వాటర్ ట్యాంకు వితరణ




**పులివెందుల సెప్టెంబర్ 15 (సీమ వార్త):** పులివెందులలో కొలువైన పురాతన శ్రీ రంగనాథ స్వామి ఆలయానికి 2000 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకును శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల మరియు సాయి చైతన్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఆరవేటి నారాయణరెడ్డి వితరణంగా అందజేశారు. ఆలయంలో భక్తులకు తాగునీటి సౌకర్యార్థం సరైన వసతి లేకపోవడం గుర్తించిన ఆయన వాటర్ ట్యాంకు సంబంధించిన దిమ్మె ను కట్టించడంతోపాటు మొత్తం వాటర్ ట్యాంకు పైప్లైన్ నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేయించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డిని ఆలయ ఈవో వెంకటరమణ అభినందించారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ అంకాలమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ తిరుమల శెట్టి వెంకట నాగేంద్రప్రసాద్ విద్యా సంస్థల అధినేత ఆరవేటి నారాయణరెడ్డి, శ్రీరంగనాథ ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు రాయల్, గుప్తా మెడికల్ అధినేత దినేష్ కుమార్ గుప్తా, శ్రీరంగనాథ ఆలయ సేవ కర్తలు చల్ల చంద్రశేఖర్, ఆలయ అర్చకులు కృష్ణరాజ శర్మ తదితరులు పాల్గొన్నారు.


## శ్రీ సత్య సాయి జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారిగా బండ్లపల్లి రంగనాథ్ ఎంపిక

**జిల్లా కమిటీలో పలువురు ధర్మవరం ఆర్యవైశ్యులకు చోటు**



**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 15 సీమవార్త :** శ్రీ సత్య సాయి జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని మంగళవారం బుక్కపట్నం మండలం జానకంపల్లి వద్ద నిర్వహించిన ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో శ్రీ సత్య సాయి జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పుట్టపర్తి శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఈలూరు లక్ష్మయ్య, సత్యసాయి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరు అయ్యారు. శ్రీ సత్య సాయి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా పోలేపల్లి ప్రశాంత్ కుమార్ ప్రమాణ స్వీకారం చేయగా సత్యసాయి జిల్లాలోని పలువురికి కమిటీలో చోటు కల్పించారు. కోశాధికారిగా ధర్మవరం పట్టణానికి చెందిన బండ్లపల్లి రంగనాథం, మీడియా కమిటీ చైర్మన్ గా గ్రంధే శ్రీనివాసులు, ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్గా పోడమల కృష్ణ కుమార్, జాయింట్ సెక్రటరీగా బండ్లపల్లి రంగనాథ్, రేపాకుల సుబ్బయ్య, బద్రీనాథ్ గుప్తా, ఆర్వేట్ కిషోర్, రామకృష్ణ తదితరులు ప్రమాణ స్వీకార కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి ధర్మవరం పట్టణానికి చెందిన పలువురు ఆర్యవైశ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ గడువు పొడిగించాలని ఎమ్మార్వోకు వినతి పత్రం




**యాడికి సెప్టెంబర్ 15 ( సీమ వార్త )** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం క్రింద కొత్త దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ అయితే మా యాడికి మండల పరిధిలోని అనేకమంది అర్హులైన వృద్ధులు వితంతువులు చేనేతలు మరియు ఒంటరి మహిళలు మరియు దివ్యాంగులు సాంకేతిక కారణము వల్ల అవసరమైన సర్టిఫికెట్లు సకాలంలో అందకపోవడం మరియు సర్వర్ లోపం వల్ల దరఖాస్తు చేసుకోలేకపోయారు పింఛన్ తప్పనిసరిగా అవసరమైన ఎంతోమంది పేదలు గడువు ముగిసిపోవడం వల్ల తీవ్ర ఆందోళన చెందుతున్నారు కావున మానవతా దృక్పథంతో స్పందించి అర్హులైన లబ్ధిదారులందరికీ న్యాయం జరిగేలా ఎన్టీఆర్ పెన్షన్ గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని యాడికి మండల ప్రజల తరఫున మిమ్మల్ని వినయంగా కోరుచున్నామని యాడికి ఎమ్మార్వోకు వినతిపత్రం ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెస్ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు ఉపేంద్ర గౌడ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడిపత్రి నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు తెల్లాకుల శివప్రసాద్ మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు

## సేవా స్ఫూర్తితో వినాయక చవితి

**మహిళలకు అండగా వి.ఆర్. కుటుంబం**

**నిరుపేదలకు ఉచిత తోపుడు బండ్ల పంపిణీ**

**తాడిపత్రి, సెప్టెంబర్ 15 సీమ వార్త :** మహా వినాయక చవితి పండుగను పురస్కరించుకొని తాడిపత్రిలో ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. వి.ఆర్. రామిరెడ్డి, వి.ఆర్. వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరు నిరుపేద మహిళలకు రూ.50 వేలు విలువ చేసే తోపుడు బండ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వి.ఆర్. రామిరెడ్డి మాట్లాడుతూ మహిళలు తమ స్వశక్తితో జీవనోపాధి పొంది సంతోషంగా, ఆరోగ్యంగా జీవించాలన్నదే తమ ఆశయమన్నారు. రాబోయే రోజుల్లో మరికొంత మంది మహిళలకు కుట్టు మిషన్లు కూడా ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఓటుకు నోటు రాజకీయాలపై ఆయన స్పందిస్తూ ప్రజాస్వామ్య మూలాలనే కబళిస్తున్న ఈ విష సంస్కృతి ఉన్నంత వరకు పేదల బతుకులు మారవని అన్నారు. "ఆ గణనాథుడు రాజకీయ నాయకుల మనసు మార్చాలని, ఓటుకు నోటు కాదు ఓటుకు సేవ అనే ఆలోచన కల్పించాలని, ప్రజల సొమ్ము ప్రజలకే చెందేలా దీవించాలని ఆ విఘ్నేశ్వరుడిని మనసారా వేడుకుందాం" అని పేర్కొన్నారు. తోపుడు బండ్లు అందుకున్న మహిళలు వి.ఆర్. కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ బండ్లతో తమ కుటుంబాన్ని పోషించుకుంటామని ఆనందం వ్యక్తం చేశారు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా వి.ఆర్. కుటుంబం చేస్తున్న ఇలాంటి సేవా కార్యక్రమాలు తాడిపత్రిలోని ఇతర ప్రముఖులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ మూర్తి, జయరామిరెడ్డి, గోపాల్ మాదిగ, నరసింహులు, ఎంపీటీసీ ఓబులేసు, వెంకటరాముడు, అప్పిగారి వెంకటరాముడు యాదవ్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా జరిగిన వినాయక చవితి పండుగ వేడుకలు



పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తాదులు.



**ధర్మవరం సెప్టెంబర్ 15 సీమవార్త :** పట్టణంలోని వాళు వార్డులలో వినాయక మండపాలు భక్తాదులను ఆకట్టుకునే విధంగా నిర్వహించారు నిర్వాహకులు. సెప్టెంబర్ 14వ తేదీ తేదీ నుండి ఐదు రోజులు పాటు ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని కేశవనగర్లో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని బీజేపీ నాయకులు ఎర్రజోడు లోకేశ్, ఎర్రజోడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేకంగా 1,116 కిలోల గంధంతో భారీ వినాయక విగ్రహాన్ని తయారు చేశారు. గంధంతో తయారు చేసిన ఈ భారీ వినాయకుడు స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. గంధం వినాయకుడిని చూసేందుకు భక్తులు, స్థానిక ప్రజలు ఆసక్తిగా తరలివచ్చారు. వినాయకుడికి పసుపు, కుంకుమ, పుష్పాలు, గరిక, వివిధ రకాల పండ్లను సమర్పించి, స్వామివారికి ఎంతో ప్రీతికరమైన ఉండ్రాళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం లక్ష్మీ, సరస్వతి దేవతలకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా యాదవ వీధి, ఎల్ఐసి ఆఫీస్, కేశవ నగర్ లో కూడా వేడుకలు ఘనంగా జరిగినాయి కేశవ నగర్ లో గంధముతో తయారుచేసిన విగ్రహం భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. శాంతినగర్ లో, శివానగర్లో కైలాసంలో శివుడు పార్వతి దేవి జడ వేస్తున్న దృశ్యం, మార్కండేయ స్వామి అమ్మవారి అలంకరణ అద్దంలో చూసేలా చూపులను ఆకట్టుకుంది. తదుపరి సత్యసాయి నగర్ లో 166 అడుగుల వినాయకుడిని తయారు చేయడం జరిగింది. మొత్తం మీద ఉదయం నుంచి రాత్రి వరకు భక్తాదుల సందడి నెలకొంది.

# కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాల ఎర్రిస్వామి హఠాన్మరణం





-- రాజకీయాలకు అతీతంగా నేతల నివాళులు

-- ఐదు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌తో అనుబంధం

-- పాతతరం రాజకీయాలకు సజీవ సాక్ష్యంగా నిలిచిన నాయకుడు

**కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 15, సీమవార్త:** కళ్యాణదుర్గం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, క్రమశిక్షణ గల కార్యకర్త మాల ఎర్రిస్వామి (92) మంగళవారం ఉదయం హఠాన్మరణం చెందారు. తెల్లవారుజామున నిద్రలేచి స్నానం చేసి దుస్తులు ధరించుకుంటుండగా ఒక్కసారిగా కుప్పకూలినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు సమాచారం. ఆయన మృతితో కళ్యాణదుర్గం కాంగ్రెస్ శ్రేణుల్లో విషాదం నెలకొంది. రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. దీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీతో అనుబంధం కొనసాగించిన ఎర్రిస్వామి కళ్యాణదుర్గం ప్రాంత పాతతరం రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. నాటి కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రి లక్ష్మీదేవమ్మ, ఓబయ్య, బంగి రామప్ప తదితరుల సమకాలికుడిగా రాజకీయాల్లో చురుకుగా పనిచేశారు. కళ్యాణదుర్గం మేజర్ పంచాయతీ వార్డు సభ్యుడిగా ఎన్నికై, 1969--70లో సుమారు మూడు నెలలపాటు ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. పదవుల కంటే ప్రజాజీవితానికే ప్రాధాన్యం ఇస్తూ చివరి వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కొనసాగారు. ఎర్రిస్వామి రాజకీయ ప్రస్థానం కేవలం పార్టీ కార్యకలాపా లకే పరిమితం కాలేదు. ఎస్ఎస్ఎల్సీ వరకు చదువుకున్న ఆయన సబ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగానికి ఎంపికైనప్పటికీ ప్రజాజీవితంపై ఉన్న ఆసక్తితో ఆ ఉద్యోగంలో చేరలేదని సన్నిహితులు తెలిపారు. కంబదూరు సమితి హయాంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సమయంలో సామాజిక వివక్షను నిరసిస్తూ ఉద్యోగాన్ని వదిలేసినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం 'బృందావనం' పేరుతో రవాణా వ్యాపారం నిర్వహిస్తూ కళ్యాణదుర్గం--పాళ్లూరు మధ్య సుమారు రెండు దశాబ్దాలపాటు ప్రైవేట్ బస్సు నడిపారు. 92 ఏళ్ల వయసులోనూ చురుగ్గా కనిపించిన ఎర్రిస్వామి స్థానిక రాజకీయ పరిణామాలపై ఆసక్తి కనబరిచే వారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కళ్యాణదుర్గం వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసి పార్టీ అభివృద్ధికి సంబంధించిన సూచనలు చేసినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. చేతిలో గొడుగు, తలపై టోపీతో ఎమ్మార్వో కార్యాలయం, కోర్టు ప్రాంగణం తదితర ప్రాంతాల్లో నిత్యం కనిపించే ఆయనకు అన్ని వర్గాల్లోనూ పరిచయాలు ఉండేవి. ఎర్రిస్వామి మృతివార్త తెలుసుకున్న మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు నీలకంఠాపురం రఘువీరారెడ్డి కళ్యా ణదుర్గం చేరుకుని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. చివరి శ్వాస వరకు కాంగ్రెస్ పార్టీకి నమ్మకమైన కార్యకర్తగా పనిచేశారని రఘువీరారెడ్డి కొనియాడారు. ఆయన వెంట స్థానిక నాయకులు కరణం తిప్పేస్వామి, రాంభూపాల్‌రెడ్డి, నాగరాజు, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్ల బొజ్జప్ప, ఆదివాసి రాష్ట్ర నాయకుడు గుజ్జుల ఈరన్న, తిమ్మప్ప తదితరులు ఉన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, గోపీనాథ్, రాజేష్, ఓబులరాజు, మల్లేపల్లి నారాయణ తదితరులు ఎర్రిస్వామి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. బీజేపీ కన్వీనర్ దేవరాజ్, సీపీఐ జిల్లా నాయకుడు సంజీవప్ప, వినియోగదా రుల సంఘం అధ్యక్షుడు కిషోర్‌కుమార్, జిల్లా జర్నలిస్టుల సంఘం ఉపాధ్యక్షుడు లింగప్రసాద్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఒకే పార్టీకి చెందిన నాయకుడిగా కాకుండా స్థానిక రాజకీయాల్లో సుదీర్ఘకాలం పనిచేసిన సీనియర్‌గా ఎర్రిస్వామికి ఉన్న పరిచయాలు, గౌరవానికి ఆయన అంత్యక్రియలకు వివిధ పార్టీల నాయకులు హాజరుకావడం నిదర్శనంగా నిలిచింది. పాతతరం రాజకీయ విలువలు, వ్యక్తిగత పరిచయాలు, పార్టీకి అంకిత భావంతో పనిచేసిన తరం ప్రతినిధిగా ఎర్రిస్వామి సేవలను పలువురు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఎర్రిస్వామికి భార్య నాలుగేళ్ల క్రితం మృతి చెందగా, ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

బుధవారం 16 సెప్టెంబర్ 2026
సీమ వార్త తెలుగు దినపత్రిక

# వినాయక వేడుకలు.. నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా సాగాలి..

జిల్లా ఎస్పీ..

పెనుకొండ, కియా పీఎస్, రొద్దం మండలాల్లో క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్

ఐపీయస్...

రొద్దంలో పూర్ణకుంభంతో ఎస్పీ గారికి ఘన స్వాగతం పలికిన వేద పండితులు, నిర్వాహకులు...



**రొద్దం సెప్టెంబర్ 15(సీమవార్త)** వినాయక చవితి వేడుకలు, విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఐపీయస్ మంగళవారం సాయంత్రం పెనుకొండ, కియా పోలీస్ స్టేషన్, రొద్దం ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. అదేవిధంగా పెనుకొండ, కియా పోలీస్ స్టేషన్లను సందర్శించిన ఎస్పీ సార్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం పెనుకొండలోని బోయపేట, జీఐఎస్ కాలనీ, ఆల్విన్ కాలనీ, అలాగే కియా పోలీస్ స్టేషన్ పరిధిలోని గుట్టూరు, మునిమడుగు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు . అనంతరం భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నిర్వాహకులకు ప్రజలకు సూచించారు. అనంతరం రొద్దం మండలంలో పర్యటించిన ఎస్పీ సార్ వినాయక మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వేడుకలు, నిమజ్జన కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి నిర్వాహకులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సార్ మాట్లాడుతూ ప్రజలు, నిర్వాహకులు పరస్పర సమన్వయం, సోదరభావంతో వినాయక వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణకు ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అధిక శబ్దంతో డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దని, మద్యం సేవించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడవద్దని మండపాల నిర్వాహకులకు తెలియజేశారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని నిమజ్జన ప్రాంతాల్లో బారికేడింగ్, లైటింగ్, పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పటిష్టమైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని, వేడుకల ప్రారంభం నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు పోలీసు శాఖ సూచించే భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సార్ కోరారు. ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు నిర్వహించేందుకు పోలీసు శాఖకు ప్రజలు, నిర్వాహకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ పర్యటనలో పెనుకొండ సీఐ రాఘవన్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రాజా కుల్లాయప్ప తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వైకాపా నాయకులు, కార్యకర్తలకు ఐడి కార్డుల పంపిణీ కార్యక్రమం



**మడకశిర సెప్టెంబర్ 15 సీమ వార్త** పట్టణం లోని షాదీ మహల్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం ఘనంగా ఐడి కార్డ్ పంపిణి నిర్వహించడం జరిగింది. నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో, రాష్ట్ర ముఖ్య నాయకుల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే వైటి ప్రభాకర్ రెడ్డి , మడకశిర నియోజకవర్గ అబ్జర్వర్ రఘునాథ్ రెడ్డి , రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వైసీ గోవర్ధన్ రెడ్డి , రాష్ట్ర వక్కలిగా విభాగ అధ్యక్షులు రంగే గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బి.శివకుమార్ , రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి మధుమతి రెడ్డి , జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగమణి , రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి దేశాయి భారతి రెడ్డి , మండల కన్వీనర్ కల్లుమరి శ్రీరాములు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు నరసింహమూర్తి, రాష్ట్రస్థాయి నాయకులు, జిల్లా స్థాయి నాయకులు, నియోజకవర్గ స్థాయి నాయకులు, మండల కన్వీనర్లు, పట్టణ నాయకులు, వార్డు స్థాయి నాయకులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రతినిధులు, మరియు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు, అలాగే ఐడి కార్డుల కార్యక్రమంలో మొదటిగా ఐడి కార్డును అందుకున్న వారు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గోవర్ధన్ రెడ్డి , రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి నాగభూషణ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఓం కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు గోపి, జిల్లా సోషల్ మీడియా ఉపాధ్యక్షులు నగేష్, జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి వషింబేగ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు అంజలి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ధను, మాజీ కోఆప్షన్ సభ్యులు ఫక్రుద్దీన్ భాష, పట్టణ పబ్లిసిటి అధ్యక్షులు రఘునందన్, పట్టణ వికలాంగుల విభాగమ అధ్యక్షులు జేబీవుల, మండల యువజన విభాగం కార్యదర్శి నరేష్ రెడ్డి, పట్టణ మున్సిపల్ వింగ్ అధ్యక్షులు హరిష్ ,మరియ మొదలగు వైఎస్ఆర్సిపి నాయకులు ఐడి కార్డులు అందుకోవడం జరిగింది.

## రోటరీ పురం వద్దరోడ్డు ప్రమాదం,మండల యువతి మృతి,





**తాడిమర్రి సెప్టెంబర్ 15 ( సీమ వార్త)** అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం రోటరీ పురం సమీపంలో మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలోజరిగిన రోడ్డు ప్రమాదంలో నిడిగిల్లు గ్రామానికి చెందిన చాకలి నారాయణస్వామి, విజయ దంపతుల కుమార్తె ఎం.నవనీత (20) మృతి చెందారు.ఈ ప్రమాదంలో ఆమెతోపాటు మరొక యువతి మృతి చెందగా మరో ఇద్దరు యువకులు తీవ్ర గాయాల పాలయ్యారు.వీరందరూ సకలంచెరువుకు వెళ్లి తిరిగి అనంతపురానికి వస్తున్న సమయంలో వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి హోటల్ లోకి దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు యువతులు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. మృతి చెందిన ఇద్దరుయువతులు అనంతపురం నగరంలోని త్రిపుర వైద్యశాలలో నర్సులుగా పనిచేస్తున్నారు. చేతికి అంది వచ్చిన కూతురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. యువతి నవనీత మృతితో నిడిగిల్లు గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది.

## పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోండి



**సోమందేపల్లి సెప్టెంబర్ 15 సీమ వార్త** మండల కేంద్రంలోని కేతగాని చెరువు సచివాలయ పరిధిలో 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా( ఆహార వైవిధ్యం తగినంత ప్రోటీన్ )గురించి సిడిపిఓ డాక్టర్ శాంత లక్ష్మి ఆదేశాల మేరకు సూపర్వైజర్ శుభారాణి ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరోగ్యకరమైన జీవనానికి ప్రతిరోజు వివిధ రకాల పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను సమతుల్యంగా తీసుకోవడం ఎంతో అవసరం ధాన్యాలు పప్పులు ఆకుకూరలు కూరగాయలు పండ్లు పాలు గుడ్లు,చిరుధాన్యాలు వేరుశెనగ నువ్వులు స్థానికంగా లభించే ఆహార పదార్థాలను ఆహారంలో చేర్చుకోవాలన్నారు. తగినంత ప్రోటీన్ ప్రాముఖ్యత ప్రోటీన్ పిల్లల శారీరక ఎదుగుదల కండరాల అభివృద్ధి రోగ నిరోధక శక్తి మరియు సమగ్ర అభివృద్ధికి ఎంతో అవసరమని అక్కడ హాజరైన లబ్ధిదారులకు తెలియజేశారు .ఇందులో భాగంగా అంగన్వాడీ కేంద్రం లో ఫుడ్ స్టాల్ అరేంజ్ చేయడం జరిగింది. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం పిల్లలు గర్భిణీలు మరియు బాలింతలకు పోషకాహారం అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని అంగన్వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందించే గుడ్లు, పాలు బాలా మృతం బాల సంజీవిని కిడ్స్ వంటి పోషక పోషకాహార సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు . ప్రతి కుటుంబంలోను వైవిధ్యమైన సమతుల్యమైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రతిరోజు తీసుకునేలా ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని లబ్ధిదారులు కమ్యూనిటీతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయినులు శాంతి అనసూయ, ఎం ఎల్ హెచ్ పిలలిత ఎమ్ ఎస్ కె నవ్య, ఏ డబ్ల్యు డబ్ల్యు ఎస్ మెహరూన్ పద్మావతి గీతా లక్ష్మీ రాధమ్మ పుష్ప లబ్ధిదారులు మరియు తల్లులు పాల్గొన్నారు.

## అంగరంగవైభవంగా వినాయక చవితి వేడుకలు,

వాడ వాడలా కొలువుదీరిన గణనాథులు,



**తాడిమర్రి సెప్టెంబర్ 15 (సీమ వార్త)** మండల వ్యాప్తంగా సోమవారం వినాయక చవితి వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వాడ వాడలా విద్యుత్ దీపాల అలంకరణలతో మండపాలను ఏర్పాటు చేసిగణనాథులను కొలువు తీర్చి ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. దేవదేవుడికి ఇష్టమైన పళ్ళు ఫలహారాలు,పిండి వంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 120 కి పైగా వినాయక విగ్రహాలను కొలువు తీర్చి వేడుకలను దిగ్విజయంగా జరుపుకున్నారు.భక్తుల చేత విశేష పూజలు అందుకున్న గణనాథులను నేడు (బుధవారం) నిమజ్జనానికి తరలించనున్నారు. గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై కృష్ణవేణి తెలిపారు. వినాయక మండపాలు, మరియు నిమజ్జన సమయంలో "డీజేలు" ఉపయోగించరాదని డీజే లువాడడం వల్ల యువకుల్లో గుండెపోటు వచ్చే ప్రమాదం పొంచి ఉందని అలాగే చిన్నారులు, బాలింతలు, రోగులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అందువల్ల డీజే ని పూర్తిగా నిషేధించడం జరిగిందని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా డీజే లు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే వారిపై తగిన చర్యలు చేపడతామని డీజే నిర్వాహకులపై కఠిన చర్యలు చేపడతామని వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## 700 టెంకాయలు.. 9 అడుగుల వినాయకుడు!

ప్రకృతి పరిరక్షణకు వినూత్న సందేశం.. భక్తులను ఆకట్టుకున్న టెంకాయ వినాయకుడు



**వేంపల్లె, సెప్టెంబర్ 15, సీమవార్త :** వేంపల్లె పాతపేటలోని శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి 15వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాల్లో భాగంగా ప్రకృతి పరిరక్షణను చాటిచెప్పేలా 700 టెంకాయలతో 9 అడుగుల వినాయక విగ్రహాన్ని రూపొందించి కొలువుతీర్చారు. వేంపల్లెలో తొలిసారిగా ఈ తరహాలో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అర్చకుడు హరిప్రవీణ్ నేతృత్వంలో వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టెంకాయలతో విభిన్నంగా రూపొందించిన వినాయక విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. వినాయకుడు విఘ్నాలను తొలగించే దైవమే కాకుండా ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యతను గుర్తుచేసే ప్రతీక అని తెలిపారు. టెంకాయలతో వినాయకుడిని రూపొందించడం ద్వారా ప్రకృతిని పూజించడంతోపాటు పరిరక్షించాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులు, ప్లాస్టిక్ అలంకరణలకు దూరంగా ఉండాలని సూచించారు.

## బహిరంగంగానే మున్సిపాలిటీ స్థలం కబ్జా యత్నం.. పట్టించుకోని అధికారులు !

దాదాపు 4 సెంట్లు ప్రభుత్వ స్థలం ఆక్రమణ ఆరోపణలు...స్థానికుల్లో ఆందోళన

సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని ప్రజల డిమాండ్




**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 15 సీమవార్త :** ధర్మవరం పట్టణం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని జోగోణికుంట లో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికుల ఆరోపణ.సుమారు నాలుగు మీటర్ల వెడల్పు, 45 మీటర్ల పొడవు (0.4 సెంట్లు )గల మున్సిపాలిటీ స్థలాన్ని తమ సొంతం చేసుకోవాలనే ఉద్దేశంతో కొద్ది రోజుల కిందట ఐరన్ గేటును ఏర్పాటు చేయడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది .ప్రజా అవసరాల కోసం ఉపయోగపడాల్సిన ఈ విలువైన ప్రభుత్వ స్థలము కు ఓ ప్రైవేటు ఆసుపత్రి యజమానులు గేటు ఏర్పాటు చేశారని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించుకుంటూ గేట్లు వేస్తున్నా సంబంధిత మున్సిపాలిటీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ధర్మవరం మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందన లభించలేదు. కబ్జాకి గురి కాబడిన మున్సిపాలిటీ స్థలంపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానిక అధికారుల పై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.ఈ అక్రమ ఆక్రమణల వెనుక కొందరు నాయకులు మరియు స్థానిక ప్రైవేట్ వ్యక్తుల హస్తం ఉన్నట్లు స్థానికుల గుసగుసలు.. ప్రభుత్వ ఆస్తిని కాపాడాల్సిన బాధ్యత కలిగిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ఆక్రమణదారులు ఇంతలా తెగబడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మున్సిపాలిటీ స్థలానికి వేసిన ఐరన్ గేటును తొలగించి,ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, కబ్జాకు ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా వినాయక చవితి వేడుకలు

-- వాడవాడలా భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు



**సోమందేపల్లి సెప్టెంబర్ 15 సీమ వార్త** విఘ్నాలను తొలగించి, శుభాలు, సుఖసంతోషాలతో ప్రసాదించే విఘ్నేశ్వరుడైన వినాయక చవితి వేడుకలను మండల వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. వివిధ రూపాలలో వెలసిన మహా గణపతిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళహారతి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వినాయక మండపాల వద్ద భజనలు, కోలాటాలు , సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రంగేపల్లి లో రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, సాయినగర్ లో బీజేపీ యువనాయకులు పార్థసారథిరెడ్డి, దుర్గానగర్ లో టీడీపీ నాయకులు, డీఎల్ రోడ్డులో వైసీపీ నాయకులు డీసీ అశోక్ లు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్టమైన పండుగ అని పేర్కొన్నారు. ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా విఘ్నేశ్వరుడిని పూజించడం ఆనవాయితీగా వస్తోందని, విద్య, జ్ఞానం, ఐశ్వర్యం, విజయాలను ప్రసాదించే దేవుడిగా గణేశుడిని భక్తులు కొలుస్తారని తెలిపారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి ఏడు రోజులు జైలు శిక్ష.....




**గాండ్లపెంట సెప్టెంబరు 15 సీమ వార్త.....** మండల పరిధిలోని మద్యం సేవించి వాహనాల నడుపుతూ ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తున్న వారిపై గాండ్లపెంట పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ లో కదిరి మండలానికి చెందిన ఆదెప్ప అనే వ్యక్తి మద్యం సేవించి ఆటో నడుపుతుండగా గుర్తించి వాహనాన్ని ఆపి అదుపులోకి తీసుకునీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి, అతనిని కదిరి గౌరవనీయ న్యాయస్థానం ఎదుట హాజరు పరచడం జరిగింది. విచారణ అనంతరం గౌరవనీయ న్యాయస్థానం సదరు వ్యక్తికి( 7) ఏడు రోజులు జైలు శిక్ష విధించారు. ఎస్ఐ సుమతి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినమైన,చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు భారీ జరిమానాలు విధించబడతాయని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయని తెలిపారు. అవసరమైతే చట్టం ప్రకారము జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించబడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రమాదాలను నివారించేందుకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై తెలిపారు.

## గణపతి కి ఘనంగా పూజలు.





**పెనుకొండ సెప్టెంబర్ 15 సీమవార్త:** విఘ్నాలను తొలగించి, శుభాలు, సుఖసంతో షాలుట్ ప్రసాదించే విఘ్నేశ్వరుడైన వినాయక స్వామికి మంగళవారం వినాయక చవితి ని పురస్కరించుకొని పట్టణంలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ వార్డుల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఇస్లాపురం, తిమ్మాపురం, వెంకటరెడ్డిపల్లి, డీఎస్పీ బంగ్లా ఎదురుగా ఉన్న కాలనీ, కొత్తపేట లోని వంక్షిక ఫంక్షన్ హాల్ వద్ద, బోయపేట, శ్రీకృష్ణ ఆలయం వద్ద గల గొల్లగేరి,అర్బన్ కాలనీ, ఎస్సీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, దర్గాపేట లోని ఇసుక వంక వద్ద తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద పూజలు నిర్వహించి స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వినాయక చవితి భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్టమైన పండుగన్నారు. ఏ శుభకార్యాన్ని ప్రారంభించినా ముందుగా విఘ్నేశ్వరుడిని పూజించడం ఆనవాయితీగా వస్తోందని, విద్య, జ్ఞానం, ఐశ్వర్యం, విజయాలను ప్రసాదించే దేవుడిగా గణేశుడిని భక్తులు కొలుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ కన్వీనర్ శ్రీరాములతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు , వినాయక సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## నీలకంఠాపురం దేవస్థానంలో ఆధ్యాత్మిక శోభ:

### వైభవంగా గణేష్ నవరాత్రి పూజలు

**మడకశిర సెప్టెంబర్ 15 సీమ వార్త మండల పరిధిలోని** నీలకంఠాపురం దేవస్థానంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక ఉత్సాహాల నడుమ అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయ గర్భగుడిలో వేంచేసియున్న శ్రీ బాలగణపతి, శ్రీ విద్యాగణపతి, శ్రీ విజయగణపతి స్వామివార్లకు అర్చకులు పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లను విశేష అలంకరణలతో దివ్యంగా తీర్చిదిద్దారు. ?అలాగే ఆలయ ప్రాంగణంలో స్థానిక యువకులు ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి సైతం ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ?ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరా రెడ్డి దంపతులు పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఏడీసీసీ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ హనుమంత రాయుడు కుటుంబ సభ్యులతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు



# మోక్షగుండం విశ్వేశ్వరయ్య కారణజన్ముడు, గొప్ప ఇంజనీర్

### డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.



**వేంపల్లె, సెప్టెంబర్ 15, సీమవార్త :** భారతరత్న అవార్డు గ్రహీత, ప్రఖ్యాత ఇంజనీరు స్వర్గీయ మోక్షగుండం విశ్వేశ్వరయ్య కారణజన్ముడని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ప్రస్తుతించారు. స్వర్గీయ విశ్వేశ్వరయ్య 165 వ జయంతిని కాంగ్రెస్ నాయకులు వేంపల్లి లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ విశ్వేశ్వరయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు.మైసూరు సంస్థానానికి దివాన్ గా ఉంటూ ఆ సంస్థానము పారిశ్రామికంగా, విద్యాపరంగా అభివృద్ధి చేసేటందుకు అనేక కార్యక్రమాలు చేపట్టారు.అందుకే ఆయనను ఆధునిక మైసూరు రాజ్య పితామహుడు అంటారు. కావేరీ నది మీద కృష్ణరాజ సాగర్ ఆనకట్ట నిర్మించి అపర భగీరథుడని అనిపించుకున్నారు. మైసూరు సబ్బుల కర్మాగారం, మైసూర్ విశ్వవిద్యాలయం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్ , భద్రావతి ఇనుము ఉక్కు కర్మాగారం స్థాపనలో విశ్వేశ్వరయ్య కీలకపాత్ర పోషించారు. హైదరాబాదులో అద్భుతమైన డ్రైనేజీ వ్యవస్థ,ఉస్మాన్ సాగర్,హిమాయత్ సాగర్ జలాశయాల నిర్మాణాల రూపశిల్పి విశ్వేశ్వరయ్య.తిరుమల తిరుపతి దేవస్థానం ఘాట్ రోడ్ నిర్మాణంలో విశ్వేశ్వరయ్య పాత్ర ప్రశంసనీయం.ఆయన క్రమశిక్షణ,నిరంతర శ్రమ ఇంజనీర్లందరికీ ఆదర్శమని, అందుకే ఆయన పుట్టినరోజు అయిన సెప్టెంబర్ 15వ తేదీని ఇంజనీర్ల దినంగా జరుపుకుంటారని తులసి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ,పులివెందుల నియోజకవర్గం సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ,వేముల మండల శాఖ అధ్యక్షుడు చాగలేటి వెంకటేశు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, వేమయ్య, రాజేష్, బద్రీనాథ్, రాఘవయ్య వినయ్, సాయి,ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై మల్లికార్జున రెడ్డికి సన్మానం

## లియువకులు..ఎస్సై ను ఆదర్శంగా తీసుకోవాలి

### జనసేన... కొండబోయిన సతీష్



**ఓబులదేవరచెరువు (సెప్టెంబర్16)సీమవార్త:** గంజాయి లాంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించే దిశగా ప్రయత్నం చేస్తున్న ఎస్సై మల్లికార్జున్ రెడ్డి ని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని జనసేన నాయకులు కొండబోయిన సతీష్ పిలుపునిచ్చారు.చట్ట వ్యతిరేక చర్యలను అరికడుతూ.... విధుల్లో నిబద్ధత చూపుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఎస్ఐ మల్లికార్జున రెడ్డికి జనసేన నాయకులు సతీష్ కొండకమర్ల వైయస్సార్ సర్కిల్లో మంగళవారం సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐకి పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పలువురు జనసేన నాయకులు, యువకులు,స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని మండల వ్యాప్తంగా ఎస్సై చేస్తున్న విధుల సేవలపై ప్రశంసించారు. అలాగే కార్యక్రమంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో కొండబోయిన సతీష్ తో పాటు యువకులు దామోదర్,గంగరాజు, అనిల్,సాయి,వినోద్ తదితర నాయకులు, కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గంగినాయినవారిపల్లిలో ఘనంగా వినాయక చవితి వేడుకలు......

### భక్తిశ్రద్ధలతో పూజలు.. ఆకట్టుకున్న కోలాటం, చెక్కల భజన, ఉట్టి కార్యక్రమాలు......



**నంబులపూలకుంట, సెప్టెంబర్ 15 (సీమవార్త):** నంబులపూలకుంట మండల పరిధిలోని గంగినాయినవారిపల్లి గ్రామంలో వినాయక చవితి వేడుకలను గ్రామస్తులు అత్యంత ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వినాయకుడి చేతిలో ఉన్న లడ్డూను వేలం పాట నిర్వహించగా మల్లెం సింహాద్రి నాయుడు రూ.55,000కు దక్కించుకున్నారు. అలాగే వినాయకుని వద్ద ఉంచిన దేవుని కలశం, చెరుకులను రూ.7,600కు మంజునాథ కుటుంబ సభ్యులు వేలంలో దక్కించుకున్నారు. వేలం కార్యక్రమంలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వినాయక మండపం వద్ద నిర్వహించిన కోలాటం, చెక్కల భజన, ఉట్టి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వినాయక చవితి వంటి పండుగలు గ్రామ ప్రజలందరినీ ఒక్కచోటకు చేర్చి సోదరభావం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఎక్కడెక్కడో ఉంటున్న గ్రామస్థులు సైతం పండుగ సందర్భంగా స్వగ్రామానికి చేరుకుని అందరితో కలిసి ఆనందంగా వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో ఐకమత్యాన్ని, సంప్రదాయాలను కొనసాగించేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. వినాయక చవితి వేడుకల్లో గ్రామ పెద్దలు, యువత, మహిళలు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యాడికి మండలంలోని ప్రజలకు విజ్ఞప్తి

### గణేష్ శోభయాత్ర లో భాగంగా

### నిబంధనలతో కూడిన విజ్ఞప్తిని తెలియజేసిన యాడికి పోలీస్ సిబ్బంది

**యాడికి సెప్టెంబర్ 15 ( సీమ వార్త )** రేపటి బుధవారం రోజున యాడికి మండలంలో నిర్వహించు గణేష్ శోభాయాత్ర మరియు గణేష్ ఉత్సవ విగ్రహాల నిమజ్జనం గురించి గణేష్ విగ్రహ పూజ నిర్వహణ భక్తులకు తెలియజేయడం ఏమనగా మండలంలోని చిన్న చిన్న విగ్రహాలు అనగా విగ్రహం ఎత్తు ఒక అడుగు నుండి సుమారు 5 అడుగులు ఉన్న విగ్రహాలను తిరునంపల్లి గ్రామ సమీపంలో ఉన్న నీటి కుంటలో నిమజ్జనం చేసుకొనవలెను మరియు పెద్ద విగ్రహాలను చీమల వాగుపల్లి గ్రామ సమీపం వద్ద ఉన్న నీటి కుంటలో నిమజ్జనం చేసుకొనవలెను విగ్రహాల శోభయాత్ర జరుగు సమయంలో విగ్రహాలను తీసుకుని వెళ్ళు వాహనాలలో చిన్నపిల్లలను కూర్చుని పెట్టుకొనడం గాని మరియు వారిని నిమజ్జన ప్రదేశానికి తీసుకొని పోవటం గాని నిషేధము అధిక ధ్వని కలిగించు పరికరాలను వాడకూడదు కలుషిత రంగులను చల్లుకొనటం చేయరాదు విగ్రహాల శుభయాత్రను ఉదయం 10 గంటల నుంచి ప్రారంభించి అతి త్వరగా నిమజ్జన కార్యక్రమమును పూర్తి చేయవలెను ఈ కార్యక్రమము నిర్వహించే సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలిగించకుండా మీ యొక్క వాహనాలను సరైన క్రమంలో తీసుకుని వెళు తూ ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు సహకరించవలెను ప్రజలు అందరూ ఐక్యత తో మరియు బాధ్యతాయుతంగా యాడికి మండలమునకు మంచి పేరు తీసుకుని వచ్చే విధంగా ప్రవర్తించమని పోలీసులు యొక్క విజ్ఞప్తి ఏదైనా అత్యవసర సమయము నందు పోలీసు సేవలను ఉపయోగించుకోవలెను మరియు ముఖ్య సమాచారం కొరకు ఇన్స్పెక్టర్ గాని యాడికి ఎస్ఐ గాని సమాచారం అందించమని కోరుతున్నాము యాడికి పోలీస్ సిబ్బంది తెలియజేయడం జరిగినది

## పండగపూట కూటమి నేతలకు గుడ్ న్యూస్...

### బీజేపీ, జనసేన ఆశావహులకు తలుపులు తెరిచిన కొత్త వార్డులు

**తాడిపత్రి సెప్టెంబర్ 15 సీమ వార్త:** తాడిపత్రి మున్సిపాలిటీలో 48 వార్డుల విభజన కూటమి నాయకులకు పండగపూట గుడ్ న్యూస్ గా మారింది. ఇప్పటివరకు 36 వార్డులుగా ఉన్న తాడిపత్రి పురపాలక సంఘాన్ని 48 వార్డులుగా విభజిస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో కొత్తగా 12 వార్డులు పెరిగాయి. ఈ 12 కొత్త వార్డులు అధికార కూటమిలోని బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన ఆశావహులకు మంచి అవకాశంగా మారనున్నాయని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. కొత్త వార్డుల్లో కూటమి భాగస్వామ్య పార్టీలకు సీట్లు కేటాయిస్తారనే ఆశాభావంతో ఆయా పార్టీల నాయకులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

## జర్నలిస్ట్ వైష్ణవ శ్రీనివాసులు స్వామికి స్వర్ణ నంది అవార్డు..



**ధర్మవరం రూరల్ సెప్టెంబర్ 15 సీమవార్త :** జర్నలిజం రంగంలో తనదైన ముద్ర వేస్తూ ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్ట్ శ్రీ వైష్ణవ శ్రీనివాసులు స్వామి ప్రతిష్టాత్మక స్వర్ణ నంది అవార్డుకు ఎంపిక కావడం పట్ల జర్నలిస్టులు,పాత్రికేయ మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన అవార్డుకు ఎంపిక కావడం ధర్మవరం జర్నలిజం రంగానికి గర్వకారణమని పేర్కొన్నారు.వైష్ణవ శ్రీనివాసులు స్వామి ప్రజల సమస్యలను తన కలం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు,సమాజంలో జరుగుతున్న అనేక అంశాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చారని కొనియాడారు. ప్రజల పక్షాన నిలబడి నిబద్ధతతో పనిచేయడం ద్వారా పాత్రికేయ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు.అదేవిధంగా తోటి జర్నలిస్టులకు విలువలతో కూడిన సూచనలు,సలహాలు అందిస్తూ ఎంతోమందిని ప్రోత్సహిస్తున్నారని అన్నారు. జర్నలిజంలో నైతిక విలువలు,ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న ఆయన సేవలకు స్వర్ణ నంది అవార్డు మరింత గుర్తింపు తీసుకువస్తుందని పేర్కొన్నారు.స్వర్ణ నంది అవార్డుకు ఎంపికైన వైష్ణవ శ్రీనివాసులు స్వామికి జర్నలిస్ట్ మిత్రులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని,ప్రజల గొంతుకగా ఆయన కలం మరింత బలంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణకు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని యువతకు పిలుపు:





## లిడ్కర్ చైర్మన్ ముంద్రగి నాగరాజ్

### బళ్లారిలో అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ వేడుకలు

**బళ్లారి, సెప్టెంబర్15 సీమవార్త:** ప్రజాస్వామ్య మరియు రాజ్యాంగ విలువల పరిరక్షణ బాధ్యత నేటి యువతపైనే ఉందని లిడ్కర్ అధ్యక్షుడు ముంద్రగి నాగరాజ్ పిలుపునిచ్చారు. యువత మొబైల్ ఫోన్ల వ్యామోహాన్ని వీడి, పుస్తక పఠన అలవాటును మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఆయన కోరారు. నగరంలోని జోలదరాశి దొడ్డనగౌడ రంగ మందిరంలో మంగళవారం జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ మరియు సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ' వేడుకలు మరియు యువతకు దేశ పార్లమెంటరీ వ్యవస్థపై అవగాహన కల్పించే 'యూత్ పార్లమెంట్' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. గతంలో రాచరిక వ్యవస్థలో రాజులు కేవలం రాణులకే జన్మించేవారని ఆయన గుర్తుచేశారు. అయితే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమానత్వం ఆధారంగా రాజ్యాంగాన్ని రూపొందించి, ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం ద్వారా అధికారం బ్యాలెట్ బాక్స్ ద్వారానే నిర్ణయించబడేలా చేశారని ఆయన పేర్కొన్నారు. సాధారణ గ్రామ పంచాయతీ సభ్యుడి నుండి ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి మరియు రాష్ట్రపతి వరకు అందరూ ప్రజాస్వామ్య బ్యాలెట్ బాక్స్ ఫలితంగానే తమ పదవులను అధిష్ఠిస్తున్నారని చెబుతూ, రాజ్యాంగ నిర్మాతకు ఆయన నివాళులర్పించారు. బాబాసాహెబ్ రెండేళ్ల, పదకొండు నెలల, పద్దెనిమిది రోజుల సుదీర్ఘ కృషి ఫలితంగా రూపొందించిన రాజ్యాంగం వల్లే నేడు మనం సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ సమానత్వాన్ని అనుభవిస్తున్నామని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో, కళాశాలల్లో రాజ్యాంగ పఠనం మరియు 'యూత్ పార్లమెంట్' తరహా కార్యక్రమాలను మరింతగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. యువత సమాజానికి భయపడకుండా, సమాజమే తమను గౌరవించే స్థాయికి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని ఆయన సూచించారు. 'రీల్స్' మరియు సోషల్ మీడియాలో సమయాన్ని వృథా చేయడం మానేసి, బలమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించడానికి అవసరమైన దూరదృష్టి, నిజాయితీ, ఆత్మవిశ్వాసం, సంభాషణా నైపుణ్యాలు మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నగర కార్పొరేషన్ మేయర్ పి. గాదెప్ప మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలోని బృందం రూపొందించిన రాజ్యాంగం... నేడు భారతదేశంలో మనమందరం స్వేచ్ఛగా, సురక్షితంగా మరియు మన ఇష్టానుసారం జీవించగలుగుతున్నామంటే దానికి ప్రధాన కారణం అంబేద్కరే. దేశంలోని తదుపరి తరం వారి ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, బాబాసాహెబ్ అంబేద్కర్ తన ఆహారం, నిద్ర మరియు కనీస సౌకర్యాలను సైతం పక్కనపెట్టి భరించిన అపారమైన శ్రమ, కష్టాల ఫలితమే నేడు మనం చూస్తున్న సుస్థిరమైన భారతదేశం అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిసి కె. నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అత్యుత్తమ పాలనా విధానమని అన్నారు. వివిధ పాలనా విధానాలను లోతుగా అధ్యయనం చేసిన తర్వాత, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారతదేశానికి ప్రజాస్వామ్యమే అత్యుత్తమ విధానమని స్పష్టంగా సిఫార్సు చేశారు. రాజ్యాంగం ద్వారా, ఎటువంటి వివక్షకూ తావులేకుండా ప్రతి పౌరుడికి "ఒక వ్యక్తి - ఒక ఓటు" అనే సమాన హక్కును అంబేద్కర్ కల్పించారని ఆయన గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే కేంద్ర బిందువు. ప్రభుత్వం మరియు పౌరులు వేర్వేరు కాదు; ప్రభుత్వం ప్రజలదే. ఎన్నికైన ప్రతినిధులు లేదా పాలన సరిగా లేనట్లయితే, వారిని మార్చే సంపూర్ణ అధికారం పౌరులకు ఉంటుంది. ఎన్నికల రోజును కేవలం ఇంట్లో గడిపే సెలవు దినంగా భావించకుండా, తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచి ప్రభుత్వాన్ని మరియు సమర్థులైన ప్రతినిధులను ఎన్నుకోవాలని ఆయన అందరికీ సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య విలువలను పెంపొందించేందుకు ఐక్యరాజ్యసమితి సాధారణ సభ సెప్టెంబర్ 15ను 'అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం'గా ప్రకటించింది. ఈ నేపథ్యంలో, విద్యార్థులలో ప్రజాస్వామ్య సూత్రాలు మరియు పార్లమెంటరీ కార్యకలాపాలపై అవగాహన కల్పించేందుకు మొదటిసారిగా 'యూత్ పార్లమెంట్'తో సహా వివిధ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఈ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారని, అలాగే నవంబర్ 26న జరగబోయే 'రాజ్యాంగ దినోత్సవం'ను అర్థవంతంగా జరుపుకోవడానికి కలిసి కృషి చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ సీఈఓ మహమ్మద్ హారిస్ సుమేర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడం మాత్రమే కాదని, అది సామాజిక, ఆర్థిక మరియు రాజకీయ న్యాయాలను కూడా కలిగి ఉంటుందని అన్నారు. సామాజిక న్యాయమే ప్రజాస్వామ్యానికి నిజమైన ప్రాణాధారం అని ఆయన నొక్కి చెప్పారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులతో పాటు, పౌరులు తమ ప్రాథమిక విధులను కూడా విస్మరించకూడదని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని చెబుతూ, విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించి దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత మరియు బహిరంగ జీవితాల్లో రాజ్యాంగ విలువలను గౌరవించి, వాటికి కట్టుబడి ఉన్నప్పుడే భారతదేశం 'విశ్వ గురువు'గా (ప్రపంచ నాయకుడిగా) ఎదగగలదని మరియు సుస్థిర అభివృద్ధిని సాధించగలదని ఆయన అభిప్రాయపడ్డారు. కంప్లిలోని ప్రభుత్వ బాలుర ప్రీ-యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సిద్ధన్న పరమేశ్వర్ ప్రజాస్వామ్య ఆదర్శాలపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పీఠికను పఠించారు. అంతకుముందు, ప్రముఖులు 'యువ పార్లమెంట్'కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్యారంటీ యోజనల అమలు ప్రాధికారం ప్రాధికార సంస్థ చైర్మన్ కె.ఇ. చిదానందప్ప, అదనపు ఎస్పీ నవీన్ కుమార్, నగర కార్పొరేషన్ కమిషనర్ పి.ఎస్. మంజునాథ్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చిదానందప్పతో పాటు వివిధ దళిత సంఘాల ప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# దుర్గం రూరల్.....పోలీసుల నిఘాకు చిక్కిన ఆలయ దొంగల ముఠా.







-రూ.40 లక్షల విలువైన 21 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం.. --ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్.

- కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు ఎస్పీ ప్రశంసలు

**కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 15, సీమ వార్త.** దేవాలయాలే లక్ష్యంగా పక్కా ప్రణాళికతో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా ఆటను కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ పోలీసులు కట్టించారు. ముఖాలకు మాస్కులు, చేతులకు గ్లౌజులు ధరించి, సీసీ కెమెరాలపై స్ప్రే చేసి దృశ్యాలను బ్లర్ చేయడం, డీవీఆర్‌లను ఎత్తుకెళ్లడం వంటి పద్ధతులతో ఆధారాలు మిగలకుండా జాగ్రత్తలు తీసుకున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు రూ.40 లక్షల విలువైన 21 కిలోల వెండి ఆభరణాలు, కరిగించిన వెండి ముద్దలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.మంగళవారం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్, ఐపీఎస్ కేసు వివరాలను వెల్లడించారు. కురపాటి సాయికుమార్ (27), కనుముక్కల చాంద్‌బాషా (29), గుండప్పగారి సూదం (32)లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని తాళం వేసిన దేవాలయాలను గుర్తించి, ఎవరూ లేని సమయంలో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. కంబదూరు పరిధిలోని రాంపురం మారెమ్మ ఆలయంలో సీసీ కెమెరాలను ధ్వంసం చేసి చోరీ చేసిన ఘటనపై నమోదైన కేసు దర్యాప్తులో పోలీసులు ముఠా నేరశైలిని గుర్తించారు. ఆ కేసును ఆధారంగా చేసుకుని ఆలయ దొంగలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయి సమాచారం, నిఘా ఆధారాలను అనుసంధానిస్తూ సాగించిన దర్యాప్తులో ముఠా సభ్యుల కదలికలపై పోలీసులకు కీలక సమాచారం లభించింది. దీంతో కంబదూరు చెక్‌పోస్ట్ వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా వరుస ఆలయ చోరీల వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. కంబదూరు, బ్రహ్మసముద్రం, శెట్టూరు, పామిడి, బుక్కరాయసముద్రం, రామగిరి-నసనకోట ముత్యాలమ్మ ఆలయం, రొద్దం ప్రాంతాలతో పాటు కర్ణాటకలోని తుమకూరు జిల్లా కొరటగెరె, క్యాసనంద్ర పరిధుల్లో జరిగిన మొత్తం తొమ్మిది ఆలయ చోరీ కేసులను ఛేదించినట్లు వెల్లడించారు. దేవతా విగ్రహాలకు అలంకరించిన వెండి ఆభరణాలు, ప్రతిమలను అపహరించి వాటిని కరిగించి విక్రయించేవారని పోలీసులు తెలిపారు. అరెస్టయిన సాయికుమార్, చాంద్‌బాషాలకు గతంలోనే పలు కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. సింగనమల పరిధిలో రెండు, నార్పల, అనంతపురం రూరల్, గార్లదిన్నె, బీకేఎస్ పరిధుల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఆరు పాత కేసులు ఉన్నట్లు తెలిపారు. మూడో నిందితుడు సూదంపైనా పాత కేసులు ఉన్నట్లు వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు పర్యవేక్షణలో రూరల్ సీఐ నీలకంటేశ్వర, కంబదూరు ఎస్సై లోకేష్ ఆధ్వర్యంలో ఏఎస్సై గంగాధర్, కానిస్టేబుళ్లు ఖాజా, మహేష్, ప్రసాద్, మోహన్‌కృష్ణ, రామానాయుడు, హరీష్‌లతో ప్రత్యేక బృందం ఏర్పాటైంది. పక్కా సమాచారంతో ఈ బృందం నిందితులను పట్టుకుంది. దేవాలయాల భద్రతకు, ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు భంగం కలిగించే చర్యలను సహించేది లేదని ఎస్పీ జగదీష్ స్పష్టం చేశారు. ఎంతటి నేర ముఠా అయినా చట్టం ముందు తలవంచాల్సిందేనన్నారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

## ఘనంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 76వ జన్మదిన వేడుకలు.



**పెనుకొండ సెప్టెంబర్ 15 సీమవార్త.** పట్టణంలోని బాలురు గురుకుల హాస్టల్ లో మంగళవారం ప్రధాని నరేంద్ర మోడీ 25 ఏళ్లు ప్రజాసేవ పాలన సంకల్పం అభినయ్ కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ ఎస్సిమోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఫనతల సురేష్ పిలుపుమేరకు 200 మంది విద్యార్థులతో పోస్టల్ కార్డు ద్వారా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కార్డులను పోస్టర్ ద్వారా ప్రధానమంత్రి కార్యాలయానికి పంపించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అనంతపురం ఇన్చార్జి ఎనుముల రామకృష్ణ మండల అధ్యక్షురాలు మమత సీనియర్ నాయకులు అంగడి రామాంజనేయులు,ఎం రవి, హనుమంతు యాదవ్, మధుసూదన్, వేద వ్యాష్, ముత్యాలమ్మ, సుభద్రమ్మ, త్రినాథ్,ఎత్తి రాజు, మునిమడుగు వెంకటరాముడు, గోవిందు, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు మరియు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయం లో వై ఫై ఏర్పాటు చేసిన వందేమాతరం టీం సభ్యులు కొండ్ల రమేష్....



**తనకల్లు, సెప్టెంబర్ 15 సీమ వార్త సాయంత్రం న్యూస్..** తనకల్లు మండల పరిధిలోని గేమేనాయక్ తాండ పంచాయతీ, నాయనచెరువు పల్లి నివాసి కొండ్ల రమేష్ గేమె నాయక్ తండా సచివాలయంలో నెట్‌వర్క్ సమస్య కారణంగా ఇన్‌కమ్ సర్టిఫికేట్, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, పెన్షన్ దరఖాస్తులు తదితర ప్రభుత్వ సేవలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని, తన సొంత నిధులతో వై-ఫై సదుపాయాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. గేమేనాయక్ తాండ పంచాయతీ ప్రజలకు ఎల్లవేళలా అండగా నిలుస్తున్న వందేమాతరం కుటుంబ సభ్యుడు అందరి బంధువు కొండ్ల రమేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు మీరు ఇలాంటి సహాయ సహకారాలు మండల వ్యాప్తంగా చేయాలని కోరుతూ ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ. అభినందనలు తెలియజేస్తున్న షేక్ మహబూబ్ బాషా తెలుగుయువత నాయకులు తనకల్లు మండలం.

## తాగునీటి కోసం రోడ్డెక్కిన హెచ్ టి హాళ్లి గ్రామ ప్రజలు



**మడకశిర సెప్టెంబర్ 15 సీమ వార్త సాయంకాలం** నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండల పరిధిలోని హెచ్ టి హాళ్లి బిసి కాలనీ యందు గత రెండు సంవత్సరాల నుండి త్రాగునీటి కోసం త్రివ ఇబ్బందులు పడుతున్న పులుమార్లు అధికార దృష్టికి తీసుకో పోయిన కూడా స్పందించకపోవడంతో విధిలేని పరిస్థితిలో మంగళవారం ఉదయం 10 గంటలకు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి బంద్ చేపట్టారు . ఈ సందర్భంగా హిందూపురం టు సిర ఆర్టీసీ బస్సులు అడ్డగించి రస్తారోక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సు నందు ముగ్గురు చిన్న పిల్లలు ఆసుపత్రి కోసం రావడంతో స్పందించిన హెచ్ టీ హాళ్లి యువకులు ప్రత్యేకంగా రెండు కారు , ఒక బుల్లారా వాహనం ఏర్పాటు చేసి వారి గమ్యస్థానానికి పోవడానికి ఏర్పాటు చేసినారు. 12 గంటల అధికారులు వచ్చి స్థానిక రొళ్ల మండలం రక్షణ శాఖ అధికారి పంచాయతీ కార్యదర్శి స్థానిక నాయకుడు మాజీ పంచాయతీ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ బి ఎన్ నారాయణప్ప సంఘటన స్థలానికి చేరుకొని నాలుగు రోజుల్లోగా గ్రామంలో ఉన్న కొత్త బోరుకు మోటర్ బిగించి త్రాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ప్రజల శాంతించారు ఈ కార్యక్రమానికి మాజీ వార్డ్ మెంబర్లు సలావుల, మైనార్టీ నాయకుడు మహబూబ్ బాషా, శ్రీరంగప్ప, రామచంద్రప్ప, వెంకటరమణ ,శంకర్, పొగాకు రమేష్ శారదమ్మ, అనితమ్మ, రాజమ్మ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వినాయక మండపంలో వైసీపీ సీనియర్ల భేటీ....

తాడిపత్రిలో కొత్త చర్చకు తెర

**తాడిపత్రి, సెప్టెంబర్ 15 సీమ వార్త :** తాడిపత్రి పట్టణంలో వినాయక చవితి వేడుకలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. స్థానిక వైసీపీ సీనియర్ నాయకుడు వీ.ఆర్ రామిరెడ్డి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో వైసీపీ సీనియర్ నాయకులు వీఆర్ రామిరెడ్డి, పేరం నాగిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకుడిని దర్శించుకున్న అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్న ప్రసాదం వడ్డించారు. చాలా రోజుల తర్వాత పాత వైసీపీ నేతలైన వీఆర్ రామిరెడ్డి, పేరం నాగిరెడ్డి ఒకే వేదికపై కలవడంతో తాడిపత్రి రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేచింది. అనంతరం ఇరువురు అగ్రనేతలు తాజా రాజకీయ పరిణామాలపై సుధీర్ఘంగా చర్చించినట్లు సమాచారం.



# ఎన్.బి.ఎ గుర్తింపు పై మంత్రి సత్య కుమార్ హర్షం..

ధర్మవరం పాలిటెక్నిక్‌ను సందర్శించి విద్యార్థులను అభినందించిన మంత్రి

ఆధునిక సాంకేతిక విద్యతో ధర్మవరం విద్యార్థులు దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి...

విద్యార్థులు ఉద్యోగాలు పొందడమే కాదు.. ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి...

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

పాలిటెక్నిక్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం

మంత్రి సత్యకుమార్ యాదవ్....





**ధర్మవరం సెప్టెంబర్ 15 సీమవార్త :** ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని అన్ని కోర్సులకు ప్రతిష్టాత్మక నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు 2029 డిసెంబర్ 31 వరకు పొడిగించబడిన సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ మంగళవారం కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్.బి.ఎ గుర్తింపు సాధించడంలో కృషి చేసిన కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను మంత్రి అభినందించారు. కళాశాలలోని విద్యా వాతావరణం, విద్యార్థులకు అందుతున్న సాంకేతిక శిక్షణ, ప్రయోగశాలలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించడంతో పాటు, తమ తల్లిదండ్రులను గర్వపడేలా చూసుకోవాలని, సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా గౌరవప్రదమైన స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ దేశపు యువత ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా.. ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి. మీరు సంపాదించే జ్ఞానం, నైపుణ్యాలు మీ జీవితానికే కాకుండా మరొకరికి ఉపాధి కల్పించే స్థాయికి తీసుకెళ్లాలి అని మంత్రి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకుని, దేశ ప్రగతిలో ధర్మవరం విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సివిల్ సర్వీసెస్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఇప్పటి నుంచే నిర్దేశించుకోవాలని మంత్రి సూచించారు. ధర్మవరంలోని సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమయ్యే విద్యార్థులకు అవసరమైన కోచింగ్‌ను ఉచితంగా అందించేందుకు సహకరిస్తామని తెలిపారు. ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారకుండా ప్రతిభ ఉన్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేలా అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కళాశాలలో విద్యార్థులకు మరింత మెరుగైన సాంకేతిక విద్య, ప్రాక్టికల్ నైపుణ్యాలు అందించేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక విద్యా సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, విద్యార్థుల్లో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించి, భవిష్యత్ ఉపాధి అవకాశాలకు వారిని సిద్ధం చేయడమే లక్ష్యమన్నారు. ఎన్బీఏ గుర్తింపు రావడం కళాశాలకు మాత్రమే కాకుండా ధర్మవరం ప్రాంత విద్యార్థులకు కూడా గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది కళాశాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా కంప్యూటర్ ల్యాబ్‌ను మరింత అభివృద్ధి చేయడం, కంప్యూటర్ ల్యాబ్‌లో నాలుగు ఏసీలు ఏర్పాటు చేయడం, కళాశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణం వంటి అవసరాలను వివరించారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం, సాంకేతిక సదుపాయాలు కల్పించేందుకు వీటిపై సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. అదేవిధంగా ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంవత్సరానికి సుమారు ఏడు నుంచి ఎనిమిది సార్లు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల సిబ్బంది మంత్రికి వివరించారు. ఈ జాబ్ మేళాలకు వివిధ ప్రముఖ కంపెనీలు హాజరవుతున్న నేపథ్యంలో, ఆయా సంస్థల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా కళాశాలకు అవసరమైన మౌలిక వసతులు, సాంకేతిక పరికరాలు సమకూర్చేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి కొన్ని ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని, మంత్రి చొరవ తీసుకుని సంబంధిత కంపెనీలతో సమన్వయం చేసి సి.ఎస్.ఆర్ నిధులు కళాశాలకు అందేలా సహకరించాలని కోరారు. కళాశాల సిబ్బంది విజ్ఞప్తిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే మౌలిక వసతులు, సాంకేతిక సదుపాయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. జాబ్ మేళాల ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, వాటి ద్వారా కంపెనీలతో కళాశాలకు ఏర్పడుతున్న అనుసంధానాన్ని ఉపయోగించుకుని సి.ఎస్.ఆర్ సహకారాన్ని తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు. ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు లభించిన ఎన్.బి.ఎ గుర్తింపు విద్యా నాణ్యతకు లభించిన ప్రతిష్ఠాత్మక గుర్తింపుగా అభివర్ణించిన మంత్రి, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, ఆత్మవిశ్వాసం కలిగిన యువతే అభివృద్ధి చెందిన భారతదేశానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా కళాశాలలో మంత్రి సత్యకుమార్ యాదవ్, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి ఇంజనీర్స్ డే వేడుకలు జరుపుకొని ఆయన్ను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు, శాఖాధిపతులు బాలస్వామి, హరిబాబు, సీనియర్ అధ్యాపకులు కళ్యాణి బాలజ్యోతి, తదితర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనంతకు మహర్దశ..!!

**అనంతపురం, సెప్టెంబర్ 15 : సీమ వార్త** అనంతపురం నగర అభివృద్ధిలో భాగంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలోని పాతవూరులోగల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి గుడి ఎదురుగా ఉన్న వాటర్ ట్యాంక్ కాంపౌండ్ లో అనంతపురం నగర పాలక సంస్థ త్రాగునీటి మెరుగుదల పథకం మరియు మురుగునీటి నిర్వహణ వ్యవస్థ పథకం (అమృత్ 2.0 పథకం ద్వారా) కింద అంచనా మొత్తం 107.71 కోట్ల రూపాయలతో రెండు భారీ ప్రాజెక్టులకు మంగళవారం సాయంత్రం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ.భరత్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, తదితరులు పాల్గొన్నారు.నగరంలో తాగునీటి సరఫరాలో ఉన్న అంతరాలను పూర్తిగా తొలగించి.. ప్రతి ఇంటికీ సమర్థవంతంగా నీటిని అందించడమే లక్ష్యంగా రూ. 37.39 కోట్లతో 'వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ స్కీమ్' ఇందులో ఉంది. నీటి సరఫరాను క్రమబద్ధీకరించేందుకు నగరంలో 5.47 కిలోమీటర్ల పొడవైన గ్రావిటీ మెయిన్ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు తాగునీరు చేరేలా 12.27 కిలోమీటర్ల పొడవునా కొత్త డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ను నిర్మించనున్నారు. నగరంలో నీటి కొరత రాకుండా ఉండేందుకు 6 కొత్త ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించి, మొత్తం 5200 కిలోలీటర్ల సామర్థ్యం గల అదనపు నీటి నిల్వను అందుబాటులోకి తెస్తున్నారు. నగరంలోని మారుతి నగర్, సంగమేశ్ నగర్, ఆదర్శ నగర్, గాంధీ పార్క్, మరియు జనశక్తి నగర్ వంటి ప్రముఖ ప్రాంతాలలో ఈ కొత్త ట్యాంక్ లను నిర్మించనున్నారు. మరోవైపు తాగునీటితో పాటు నగర పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు రూ.70.32 కోట్లతో అమృత్ 2.0 సీవరేజ్ అండ్ సెప్టేజ్ మేనేజ్‌మెంట్ స్కీమ్' పనులకు శ్రీకారం చుట్టారు. నగర మురుగునీటిని శుద్ధి చేసేందుకు అత్యాధునిక సాంకేతికతతో 25 ఎం.ఎల్.డి సామర్థ్యం కలిగిన భారీ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించనున్నారు. మురుగునీటి తరలింపు కోసం 5.47 కిలోమీటర్ల పొడవైన సీవర్ ట్రంక్ మెయిన్ నిర్మాణంతో పాటు, ప్లాంట్ నిరంతర నిర్వహణ కోసం 250 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ను కూడా ఏర్పాటు చేస్తున్నారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు టీజీ.భరత్ మాట్లాడుతూ అమృత్ 2.0 పథకం ద్వారా నీటి సమస్య లేకుండా చేస్తున్నందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రాజెక్టుల అమలు ద్వారా అసలు అనంతపురం నగరానికి ఎక్కడా తాగునీటి సమస్య ఉండదన్నారు. మురుగునీరు శుద్ధి చేసేలా 25 ఎం.ఎల్.డి ప్లాంట్ ను తీసుకొచ్చారన్నారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేసే విధంగా చర్యలు చేపట్టారన్నారు. ఇలాంటివి చేయాలంటే.. అది ఒక్క ఎన్డీఏ ప్రభుత్వంతో మాత్రమే సాధ్యమన్నారు. వేరే ప్రభుత్వాలకు ఇలాంటి ఆలోచనలు ఉండవన్నారు. గత ప్రభుత్వంలో పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లు మూసివేశారన్నారు. పేదల కడుపుకొట్టే ఆలోచన వారికి ఎలా వచ్చిందో అర్థం కావడం లేదన్నారు. ఎన్ని కష్టాల్లు ఉన్నా తల్లికి వందనం వంటి పథకాలు వంటివి ఇచ్చిన మాట ప్రకారం నెరవేర్చినట్టు చెప్పారు. త్వరలోనే కొత్త పింఛన్లను ఇస్తున్నామని మంత్రి భరత్ చెప్పారు. కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా శ్రీ సత్యసాయి జిల్లాలో 5వ జనరేషన్ యుద్ధవిమానాల తయారీ పరిశ్రమను లక్ష కోట్లతో తీసుకొచ్చామన్నారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి చాలా మంచి అవకాశాలు వస్తాయన్నారు. ఇప్పటి నుంచే చదువుకున్న వారు, వ్యాపారాలు చేసుకునే ముందు చూపుతో వ్యవహరిస్తే.. మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. 20 లక్షల ఉద్యోగాలు తెస్తామని గతంలో మాట ఇచ్చామని, అది నెరవేర్చి తీరుతామన్నారు. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వస్తున్నాయన్నారు. ఇదంతా సీబీఎన్ బ్రాండ్ తోనే సాధ్యమవుతోందన్నారు. ఇవన్నీ గమనించి.. ఏ ఎన్నికలు జరిగినా కూటమిని గెలిపించాలన్నారు. పొరపాటున ఇతరులను గెలిపిస్తే వారు పని చేసే పరిస్థితి ఉండదన్నారు. వాళ్లకు కేవలం పదవులు, డబ్బు కావాలని పని చేసే పరిస్థితి ఉండదన్నారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమిని గెలిపించాలన్నారు. గతంలో కేంద్రం నుంచే వచ్చే నిధులను దారి మళ్లించారన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ ఛార్జీలను పెంచకుండా తగ్గిస్తున్నామన్నారు. గుజరాత్ లో గత 25 ఏళ్లుగా ఒకే ప్రభుత్వాన్ని గెలిపించడం వలనే అభివృద్ధి సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో, దేశంలో ఒక స్థిరమైన, బలమైన ప్రభుత్వం ఉంది కాబట్టే అభివృద్ధి జరుగుతోందన్నారు. మంత్రి నారా లోకేష్ డీఎస్సీని సమర్థవంతంగా చేపడితే.. అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి నాయకుడు దొరకడం మన అదృష్టమన్నారు. అనంతపురంలో అభివృద్ధి గురించి చెప్పాలంటే.. ఇక్కడ రియల్ ఎస్టేట్ లో భూముల ధరల పెరుగుదలే నిదర్శనమన్నారు. అందుకే ఇతరులు చెప్పే అబద్ధాలు నమ్మవద్దని.. కష్టపడి పని చేసే వారికి ఓట్లు వేసి గెలించాలని మంత్రి టీజీ భరత్ కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ తాగునీరు, మురుగునీటి సమస్యలకు తాత్కాలిక ఉపశమనాలు కాకుండా, భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక మౌలిక వసతుల ద్వారా శాశ్వత పరిష్కారం చూపిస్తున్నట్టు తెలిపారు. ఈ రెండేళ్లలో జరిగిన అభివృద్ధి అనంతపురం నగరంలో ఏ మూలన ఉన్న ప్రాంతానికి వెళ్లినా కనిపిస్తుందన్నారు. ఏ సమస్య ఉందన్నా.. చిన్న ఫోన్ కాల్ ద్వారానే పరిష్కరిస్తున్నామన్నారు. గత ఐదేళ్లుగా ఎక్కడ ప్రజలు పడిన ఇబ్బందిని గుర్తించి.. దానిని పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. అమృత్ 2.0 ద్వారా 107 కోట్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండేళ్ల కాలంలో 1300 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామన్నారు. ఓల్డ్ టౌన్ అమ్మవారి టెంపుల్ వద్ద 30 ఏళ్లుగా ఉన్న రోడ్డు సమస్యకు పరిష్కారం చూపామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నది ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. ఈ రెండేళ్ల కాలంలోనే 25 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ది అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో లక్ష కోట్లతో డిఫెన్స్ ఇండస్ట్రీని తీసుకొచ్చారన్నారు. ఎన్నో రాష్ట్రాలు పోటీ పడినా 36 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేసి పరిశ్రమను తీసుకొచ్చిన ఘనత మంత్రి టీజీ.భరత్ దే అని అన్నారు. రాయలసీమ జిల్లాలకు 4 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకుని రావడంలో మంత్రిది కీలక పాత్ర ఉందన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పుతో పాటు డ్రిప్పు, స్ప్రింక్లర్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చారన్నారు. 16 వేలకు పైగా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తే.. దానిపై విమర్శలు చేస్తున్నారన్నారు. వాటిలో ఎక్కడ తప్పులు జరిగాయో నిరూపించమంటే ముందుకు రారన్నారు.ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంతపురం నగరాన్ని రాష్ట్రంలో నెంబర్ -1గా నిలిపేందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి కృషి చేస్తున్నారన్నారు. నగరంలో ఏ కాలనీలో చూసినా నూతన రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారన్నారు. అనంతపురం నగరంలో 80 వేల ఇళ్లు ఉన్నాయని.. 40 వేల ఇళ్లకు ఇంటింటికీ నీరు అందిస్తున్నామన్నారు. మిగిలిన 40 వేల ఇళ్లకు కూడా నీరు అందించేందుకే ఈ పథకాన్ని తీసుకొచ్చామన్నారు. ఈ పథకం ద్వారా పాతూరులోని దక్షిణ భాగాన్ని 5 కిలోమీటర్ల మేర నీటిని పంప్ చేసి ప్రతి ఇంటికి నీరు ఇస్తున్నామన్నారు. మురుగునీటిని రీ సైక్లింగ్ చేసి వినియోగించే విధంగా మరో ప్రాజెక్టు చేపట్టామన్నారు. ఒక్కసారిగా 107 కోట్లతో ప్రాజెక్టుల పనులు భూమిపూజ చేసి ప్రారంభించారంటే.. అది ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనంతపురం జిల్లాపై ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. నీటి సమస్య లేకుండా చేసే విధంగా అమృత్ 2.0 పథకం ద్వారా ఈ ప్రాజెక్టులు చేపట్టామన్నారు. వీటిని 6 నెలల్లోనే పూర్తి చేసే విధంగా ఈ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం మహిళా పక్షపాతిగా ఉంటుందని.. వారికి మేలు చేసే విధంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసినట్టు చెప్పారు. ఈ ప్రభుత్వం చేసిన మేలు గుర్తించి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అలాగే మన రాష్ట్రం గురించి, మన భవిష్యత్ తరాల గురించి ఆలోచించేది కూటమి ప్రభుత్వం అన్నారు. ప్రస్తుతం జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింతగా కొనసాగాలంటే.. వచ్చే ఎన్నికల్లో గెలిపించాలన్నారు. అనంతరం ఇంచార్జి మంత్రిని ఘనంగా సన్మానించారు.

## గడువు ముగుస్తోంది ... ధ్రువీకరణ కరువైంది

8 గ్రామాలకు లేని వీఆర్వోలు.. పెండింగ్ లో క్యాస్ట్, ఇన్కమ్ సర్టిఫికెట్లు



**తాడిపత్రి, సెప్టెంబర్ 15 సీమ వార్త** రేపటితో వృద్ధాప్యం, వితంతు, వికలాంగులు వంటి సామాజిక పింఛన్ల దరఖాస్తుకు ప్రభుత్వం విధించిన గడువు ముగుస్తుంది. దరఖాస్తులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు దరఖాస్తుదారులు వ్యయ ప్రయాసలకోర్చి సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఫలితం లేకుండా పోతుంది. బాధితులకు ధ్రువీకరణ కరువు ఏర్పడుతోంది. తాడిపత్రి మండలంలో రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొత్త పెన్షన్లకు దరఖాస్తు చేసుకున్న పేదలు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని వీరాపురం, హుసేన్ పురం, జంబులపాడు, చాలవారిపల్లి 4 గ్రామాలకు రెగ్యులర్ వీఆర్వోలను నియమించలేదు. మరో 4 గ్రామాలైన వంగానూరు, బొందలదిన్నె, వేంకటంపల్లి, సజ్జలదిన్నె గ్రామాలకు కేవలం ఇన్-చార్జి వీఆర్వోలతో నెట్టుకొస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం కొత్త పెన్షన్ల మంజూరుకు ఈ నెల 6 నుండి 16 వరకు గడువు ఇవ్వగా, పెన్షన్ కు క్యాస్ట్, ఇన్కమ్ సర్టిఫికెట్లు తప్పనిసరి చేయడంతో పేదలు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. అయితే గ్రామాల్లో వీఆర్వోలు లేకపోవడంతో వాటి ధ్రువీకరణ జరగక సర్టిఫికెట్లు పెండింగ్ లోనే ఉండిపోయాయి. రేపే ఆఖరి గడువు కావడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. "5 రోజుల నుండి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాము.. వీఆర్వో లేదని చెబుతున్నారు.. రేపే లాస్ట్ డేట్ అంటే మా పరిస్థితి ఏంటి?" అని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ వివరణ: దీనిపై వివరణ కోసం తహసీల్దార్ ను సంప్రదించగా.. "సిబ్బంది తక్కువగా ఉన్నారు.. ప్రస్తుతం ఇన్-చార్జిలతో నెట్టుకొస్తున్నాము.. వీలైనంత త్వరగా అన్ని గ్రామాలకు వీఆర్వోలను నియమించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అయినప్పటికీ గడువు ముగిసేలోపు సర్టిఫికెట్లను మంజూరు చేసి, పెన్షన్ గడువును పొడిగించాలని ప్రజలు కోరుతున్నారు.

## బలిజ గణపతి కి.. భక్తి తో పూజలు.

....బూదిలి బూడిదగడ్డ పల్లి లో ఘనంగా వినాయక చవితి వేడుకలు.





**గోరంట్ల సెప్టెంబర్ 15 సీమ వార్త** గోరంట్ల మండలంలోని బూదిలు బూడిది గడ్డపల్లి లో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంలోని బలిజ కులస్తులు రాయల్ గణపతి పేరుతో ఏర్పాటుచేసిన ప్రత్యేక మండపం వద్ద ఘనంగా వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తూ కర్ణాటక ప్రాంతం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పూలతో మండపాన్ని అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బూదిలి పురోహితులు శ్రీకంఠం శేఖర్ శర్మ ఆధ్వర్యంలో రాయల్ గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈ వేడుకల సందర్భంగా గోరంట్ల సిఐ బోయ శేఖర్ ను మండపం నిర్వాహకులు ఘనంగా సన్మానించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. గత రెండు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా ఈ ఏడాది సైతం గ్రామంలో బలిజ కుటుంబాలు ప్రత్యేక వినాయకుడిని ఏర్పాటుచేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయల్ గణపతి మండపం నిర్వాహకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి అర్హునికి సంక్షేమం.. సత్యన్న హామీ..!!

-మొదటిపేజీ తరువాయి

విని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు, పట్టణం మరియు గ్రామాల్లో విద్యుత్ సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సరఫరా, సాగునీటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అదేవిధంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందించాలని మంత్రిని కలిసి దరఖాస్తులు సమర్పించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గేలా ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. చేనేత కార్మికులు కూడా మంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా కింద నూతనంగా అందిస్తున్న చేనేత పింఛన్లకు సంబంధించి దరఖాస్తులు, అర్హతలు, పింఛన్ మంజూరు తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మగ్గం నడుపుతూ జీవనం సాగిస్తున్న అర్హులైన చేనేత కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ, దివ్యాంగులు తదితర వివిధ సామాజిక భద్రతా పింఛన్లకు సంబంధించి కూడా పలువురు తమ సమస్యలను మంత్రికి వివరించి వినతిపత్రాలు సమర్పించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL 2013/54348 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881